ప్రజాశక్తి

మంగళవారం 15 నవంబర్ 2022 8 పేజీలు





ప్రకాశం బాపట్ల



ఎమ్మెల్యే టిజెఆర్ రాకుండా ముళ్ల చెట్టు కొమ్మను అడ్డుపెట్టిన ఒమ్మెవరం గ్రామస్తులు

మా ఊరికి రావొద్దు..

- ఒమ్మెవరంలో ఎమ్మెల్యే టిజెఆర్‌కు నిరసన సెగ
- ముళ్లకంచెలు అడ్డుపెట్టిన గ్రామస్తులు
- పోలీసులు నెట్టేయడంతో రాళ్లు, చెప్పులు విసిరిన వైనం
- మా కాలనీకి ఏమి చేశారని నిలదీసిన ప్రజలు

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు

సంతనూతలపాడు నియోజకవర్గ అధికార పార్టీ ఎమ్మెల్యే టిజెఆర్.సుధాకర్‌బాబుకు 'గడపగడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమంలో మరోసారి చుక్కెదురైంది. 20 రోజుల క్రితం నాగులుప్పలపాడు మండలం, కనపర్తి గ్రామంలోకి రానీయకుండా ఆ గ్రామస్తులు అడ్డుపడిన విషయం తెలిసిందే.. సోమవారం నాగులుప్పలపాడు మండలంలోని ఒమ్మెవరంలోనూ ఎమ్మెల్యే గ్రామంలోకి రాకుండా గ్రామస్తులు అడ్డుకున్నారు. ముళ్లకంచెలు, దిమ్మెలు అడ్డుపెట్టారు. పోలీసులు నెట్టేయడంతో ఎమ్మెల్యే ర్యాలీపైకి రాళ్లు, చెప్పులు విసిరేశారు. దీంతో గ్రామంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

ఒమ్మెవరం గ్రామస్తుల నుంచి ఎమ్మెల్యే టిజెఆర్.సుధాకర్‌బాబుకు నిరసన సెగ తగలింది. 'గడపగడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమంలో గ్రామంలోకి వచ్చేందుకు సిద్ధమైన ఎమ్మెల్యేను గ్రామస్తులు అడ్డుకున్నారు. ఎమ్మెల్యే గ్రామంలోకి రాకుండా ముళ్లకంచెలు, దిమ్మెలు అడ్డుగా పెట్టారు. 'ఎప్పుడో ఎన్నికలప్పుడు ఓట్లు అడిగేందుకు వచ్చారు.. మళ్లీ ఇప్పుడు వచ్చారు.. మా రోడ్ల పరిస్థితి చూడండి.. మా కాలనీకి ఏమి చేశారు.. మీరు మా ఇళ్లకు రావద్దు' అంటూ నిరసన తెలిపారు. ఈ ▶ 7లో

గిరిజనుల శ్మశానంపై
వైసిపి నేతల కన్ను

- గిరిజనుడి అంత్యక్రియలను అడ్డుకున్న ఆక్రమణదారుడు
- ఆందోళనకు దిగిన కాలనీవాసులు
- నిందితుడిపై అట్రాసిటీ కేసు నమోదు



అంత్యక్రియలను అడ్డుకుంటున్న వైసిపి నేత చాంద్‌బాషా

ప్రజాశక్తి-శింగరాయకొండ

శింగరాయకొండ మండలంలో వైసీపీ నాయకులు శ్మశానాలను సైతం వదలటం లేదు. దొంగ పట్టాలను అడ్డం పెట్టుకొని కోర్టు మెట్లు కూడా ఎక్కుతున్నారు. రెవెన్యూ అధికారులు కోర్టుకు పోయి ఇది ప్రభుత్వ భూమి అని చెప్పాచ్చినప్పటికీ ఆ భూమి తమదేనంటూ వైసీపీలోని కొందరు నాయకులను అడ్డం పెట్టుకొని దౌర్జన్యాలకు దిగుతున్నారు.

సోమవారం నాడు శింగరాయకొండ మండలం, పాత సింగరాయ కొండ పంచాయతీలోని బాలిరెడ్డినగర్‌కు చెందిన గిరిజనుడు పోట్లూరి వెంకట దుర్గాప్రసాద్ (26) మృతిచెందాడు. గిరిజన కాలనీవాసులైన బంధువులందరూ మృతదేహాన్ని శ్మశానం వద్దకు తీసుకెళ్లారు. నకిలీ పట్టా సృష్టించిన వైసిపి నేత చాంద్‌బాషా అక్కడకు చేరుకొని మృతదేహానికి అంత్యక్రియలు జరగకుండా అడ్డుకున్నాడు. గిరిజనులు ఇది శ్మశానానికి ఇచ్చిన భూమి అని అతనికి చెప్పినప్పటికీ వినలేదు. తనకు కోర్టు నుంచి పూర్తి స్థాయి అనుమతులు ఉన్నాయని గిరిజనులతో వాదనకు దిగాడు. తాను వైసిపి నాయకుడినని గిరిజనులను భయపెట్టాడు. మృతదేహానికి అంత్యక్రియలు జరగకుండా ▶ 7లో



ఒంగోలులో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

బాలల హక్కుల పరిరక్షణకు చర్యలు

5లో ▲

తగ్గేదేలే.!

- ఒంగోలులో ఆగని నేతల స్వరాలు..
- మరోసారి దామచర్లపై మాజీ మంత్రి బాలినేని ధ్వజం
- దేనికైనా సిద్ధమేనని జనార్ధన్ సవాల్

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

ఒంగోలులో పాలక, ప్రతిపక్ష నేతల మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది. సోమవారం నాడూ ఇద్దరూ ఒకరిపై ఒకరు హెచ్చరికలు.. సవాళ్లు.. ప్రతిసవాళ్లూ విసురుకున్నారు. తేల్చుకుందామని ఒకరిపై మరొకరు ఆరోపణలు చేసుకున్నారు. ఆర్థిక, రాజకీయ అంశాలతో పాటు వ్యక్తిగత అంశాలపైనా ఆరోపణలు సంధించుకున్నారు. ఈ పరిణామాలు రాజకీయ వర్గాల్లో వాడివేడి చర్చకు దారితీస్తున్నాయి. ఇద్దరి మధ్య ఆరోపణలు ఉత్కంఠ పరిస్థితులకూ దారితీసేలా కనిపిస్తున్నాయి. ఇద్దరూ నగరంలోనే ఉన్నారు. అభివృద్ధి పథకాలపై మొదలైన చర్చ చివరికి వ్యక్తిగత అంశాలకూ చేరింది.

ఒళ్లు దగ్గర పెట్టుకొని మాట్లాడు..: బాలినేని

తెలుగుదేశం నేత దామచర్ల జనార్ధన్‌పై ఆదివారం నాడు తీవ్రస్థాయిలో ఆరోపణలు చేసిన మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి సోమవారం నాడూ ▶ 2లో



యూనియన్ బ్యాంక్ వద్ద ఆందోళన చేస్తున్న డ్వాక్రా సంఘాల మహిళలు

డ్వాక్రా సభ్యుల సొమ్ము
రూ.50 లక్షలు స్వాహా

- నకిలీ రశీదులు ఇచ్చిన బీసీ సెంటర్ నిర్వాహకుడు
- సభ్యులకు చెప్పకుండా పొదుపు ఖాతాల్లోని నగదును రుణాలకు జమ చేసిన మేనేజర్
- కర్లపాలెం యూనియన్ బ్యాంకు ఎదుట సభ్యుల ఆందోళన

ప్రజాశక్తి-కర్లపాలెం

కర్లపాలెం మండలంలోని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కర్లపాలెం బ్రాంచికి అనుబంధంగా ఉన్న బీసీ (బిజినెస్ కలెక్షన్) పాయింట్ నిర్వాహకులు డ్వాక్రా సభ్యుల నుంచి రూ.50 లక్షలకుపైగా కట్టించుకొని పరారయ్యాడు. రుణం వాయిదాలు కట్టలేదని బ్యాంక్ నుంచి డ్వాక్రా సభ్యులకు నోటీసులు రావడంతో ఆందోళన చెందిన సభ్యులు బ్యాంక్ వద్ద ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న బీసీ పాయింట్ నిర్వాహకుడు పరారయ్యాడు. ▶ 2లో

తగ్గేదేలే..

(మొదటిపేజీ తరువాయి)

అదే బాణీ కొనసాగించారు. ఆదివారం వెంకటేశ్వర కాలనీ సమీపంలో టిడిపి సానుభూతిపరుడి టీ స్టాల్ అన్యాయంగా తొలగించారంటూ దామచర్ల ఆరోపణలు చేశారు. దీనిపై బాలినేని స్పందిస్తూ 'టీ స్టాల్‌ను మేము తొలగించామా.? ఏమి మాట్లాడుతున్నావు. టిడ్కో ఇళ్లపై ఏదేదో మాట్లాడతావు. మా కొడుకును సైకో అంటావు. ఏదో చేస్తున్నాడని అంటావు. మా వాడి క్యారెక్టర్ నీకు తెలుసా? ఒళ్లు దగ్గర పెట్టుకొని మాట్లాడు.. ఇష్టమొచ్చినట్లు మాట్లాడితే ఊరుకోను..' అని బాలినేని నేరుగా దామచర్లను హెచ్చరించారు. మా కుమారుడు జనంలోకి వెళ్లడం ఓర్చుకోలేక ఇష్టమొచ్చినట్లు మాట్లాడటం మంచి పద్ధతి కాదన్నారు. 'ఏమి జరిగినా మా అబ్బాయే చేశాడని అంటావా? నీ చరిత్ర అంతా నాకు తెలుసు' అని అన్నారు. వ్యక్తిగత విషయాల జోలికిపోవడం లేదన్నారు. పోతే చాలా ఉందని హెచ్చరించారు. తిరుపతిలో బ్యాంకులో రూ.55 కోట్లు కాదట.. రూ.61 కోట్లని తెలిసిందని బాలినేని అన్నారు. 'రూ.పాతిక కోట్లు బ్యాంకులకు ఎగనామం పెడతావా? వెంకయ్యనాయుడును అడ్డం పెట్టుకుని ఇలాంటివి చేస్తావా?' అని ధ్వజమెత్తారు. 'పేదలు రూ.పది వేలు తీసుకొని కట్టకపోతే బ్యాంకులు ఊరుకుంటాయా? మదమెక్కి మాట్లాడతావా? మా కుటుంబం గురించి తెసుకో' అని పేర్కొన్నారు. మా తాతల సమయాల్లో సిఎం బ్రహ్మానందరెడ్డి మా ఇంటికి వచ్చారని, గుర్తు పెట్టుకోవాలన్నారని చెప్పారు. మీ చరిత్ర చెప్పమంటే చెబుతానని హెచ్చరించారు.

దేనికైనా సిద్ధమే..తేల్చుకుందా..రా..

దామచర్ల సవాల్

మాజీ ఎమ్మెల్యే దామచర్ల మరోసారి బాలినేనికి సవాలు విసిరారు. దేనికైనా సిద్ధమేని.. తేల్చుకుందాం..రా.. అని సవాల్ విసిరారు. సోమవారం నాడు దామచర్ల కూడా మీడియా సమావేశం ఏర్పాటు చేసి ఆదివారం నాడు బాలినేని చేసిన వ్యాఖ్యలపై ఘాటుగానే స్పందించారు. తాను టిడ్కో ఇళ్ల పనులు మొదలు పెట్టలేదని మాట్లాడితే.. మంజూరు చేసిన ఇళ్లు ఎన్ని? కట్టించెన్ని? అంటూ ఏదేదో మాట్లాడుతున్నారని, ఐదు సార్లు ఎమ్మెల్యే ఎలా అయ్యారని ప్రశ్నించారు. 6 వేల ఇళ్లను మంజూరు చేసి ప్లాట్లు నెంబర్లతో సహా లబ్ధిదారులకు కేటాయించామన్నారు. ఇంకా లబ్ధిదారుల సంఖ్య పెరగడంతో ఎంతమంది ఉన్నారనే సంఖ్యకోసం రూ.500 తీసుకోవడం జరిగిందన్నారు. అవి టిడ్కోకు ఇవ్వడం జరిగిందన్నారు. 'మొత్తం తీస్తావా.. ఏమి తీస్తావు..' అని ధ్వజమెత్తారు. ఏమి తీసినా ఏమీ ఇబ్బంది లేదన్నారు. నేనేమి చేశానో..ఆయనేమి చేశారో తేల్చుకుందామన్నారు. 'మీ అబ్బాయి గురించి బయట అడుగు..ఎంత మందిని హింసిస్తున్నాడో తెలుస్తుంది.ఎక్కడో ఆడుకునేవాడివి ఏమి తెలుసు నీకు' అని అన్నారు. నువ్వు ఎలా వెళ్లినా ఏమీ కాదన్నారు. 'నేను దొంగను కాను. బెదిరించడం లేదు. బ్లాక్ మెయిల్ చేయడం లేదు. నేను దోచుకోలేదు. అవినీతి సొమ్ముతో శ్రీలంక వెళ్లడం లేదు. 1972 నుంచి మా కుటుంబం వ్యాపారం చేస్తుంది' అని చెప్పారు. తిరుపతి బ్యాంకులో రూ.36 కోట్లు రుణం తీసుకుంటే రూ.22 కోట్లు కట్టానన్నారు. ఒక అధికారి కావాలని దాన్ని రూ.61 కోట్లకు వేశారన్నారు. దానికి రూ.15 కోట్లు ఎగ్గొట్టానని ప్రచారం చేయడం సరికాదన్నారు. ఏ వ్యాపారం లేకుండా.. బ్యాంకు అకౌంట్ లేకుండా ఎలా సంపాదించావ్.. కోటీశ్వర కారులో ఎలా తిరుగుతున్నావని ధ్వజమెత్తారు. అవినీతితో రూ.6 వేలు పంచుతానని చెబుతున్నావు కదా? నేను జనంలో తిరుగుతా.. తేల్చుకుందామని హెచ్చరించారు.

ఇలా ఇద్దరు నేతల మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది. ఒంగోలులో రాజకీయవేడి పెరుగుతోంది. పాలక, ప్రతిపక్ష పార్టీల నడుమ చోటుచేసుకుంటోన్న పరిణామాలు భవిష్యత్‌లో ఇక్కడ జరిగే సమరం ఎలా ఉంటుందో విదితం చేస్తున్నాయి.

బద్వేలు ఎమ్మెల్యేకు సన్మానం

దర్శి : కార్తీక మాసం సందర్భంగా తాళ్లూరు మండల పరిధిలోని గుంటిగంగమ్మ దేవాలయం వద్ద హరిదాసుల వన సమారాధ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బద్వేలు ఎమ్మెల్యే వెంకట సుధ హాజరయ్యారు. ఈ సందర్భంగా వైసిపి యూత్ ప్రధాన కార్యదర్శి జక్కుల రామకృష్ణ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే వెంకట సుధను సన్మానించారు.

విద్యార్థులకు మెస్ ఛార్జీలు పెంచాలి

ఎస్ఎఫ్ఐ ఒంగోలు నగర మహాసభ డిమాండ్

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

హాస్టల్ విద్యార్థుల మెస్, కాస్మోటిక్ ఛార్జీలను పెంచాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సిహెచ్ వినోద్ డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ ఒంగోలు నగర మహాసభ ఎల్‌బిజి భవన్ లో వెంకటేష్ అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వినోద్ మాట్లాడుతూ సంక్షేమ హాస్టళ్ల నేడు సంక్షోభంలో ఉన్నాయన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్ ఛార్జీలు లేవన్నారు. 2018లో నిర్ణయించిన ఛార్జీలు నేటికీ అమలవు తున్నాయని తెలిపారు. హాస్టల్ భవనాలు శిథిలావస్థకు చేరి పడిపోవడానికి సిద్ధంగా ఉన్నాయని, వార్డెన్, కుక్, కామాటి పోస్టులు భర్తీ చేయని కారణంగా పర్యవేక్షణ



మాట్లాడుతున్న సిహెచ్. వినోద్

పూర్తిగా కొరవడిందన్నారు. సంక్షేమ హాస్టళ్ల పై ప్రభుత్వం దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు టి.ప్రవీణ్ కుమార్, ఎస్ఎఫ్ఐ ఒంగోలు నగర నాయకులు పాల్గొన్నారు

వర్షపు నీటి తరలింపునకు చర్యలు

ప్రజాశక్తి-శింగరాయకొండ

ప్రజాశక్తి కథనానికి స్పందన

గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండల పరిధిలోని ఊళ్లపాలెం గ్రామ పంచాయతీలోని బేసిన్ పల్లిపాలెంలో నీరు చేరింది. ఈ దుస్థితి గురించి ప్రజాశక్తిలో వచ్చిన ఊరు ఏరైంది! అనే కథనానికి ఐఒఆర్‌డి అంజలి దేవి, పంచాయతీ కార్యదర్శి సైదులు స్పందించారు. సర్పంచి పాకనాటి అనసూయమ్మ , వైసిపి నాయకుడు పాకనాటి సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో బేసిన్ పల్లిపాలెంలో సోమవారం పర్యటించారు. జెసిబి సాయంతో కాలువలు తీసి గ్రామంలోని నీటిని బయటకు పంపేలా చర్యలు



కాలువ ద్వారా నీటిని బయటకు పంపుతున్న దృశ్యం

చేపట్టారు. వర్షం పడిన ప్రతి సారి పరిస్థితి ఇదే విధంగా ఉంటుందని శాశ్వత పరిష్కారం చూపాలని మత్స్యకారులు అధికారులకు విజ్ఞప్తి చేశారు.

తాగునీటి పైపులైన్‌కు మరమ్మతులు

ప్రజాశక్తి-టంగుటూరు

ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రామతీర్థం నుంచి టంగుటూరు పంచాయతీకి మంచినీరు సరఫరా చేసే పైపులైను స్థానిక ఎర్ర గేటు సమీపంలో కొట్టుకుపోయింది. దెబ్బతింది. దీంతో సర్పంచి మద్దిరాల మమత, పాలకవర్గం సభ్యుల ఆధ్వర్యంలో యుద్ధ ప్రాతిపదికన పైపులైనుకు సోమవారం మరమ్మతులు నిర్వహించారు. గతంలోనూ వర్షాల కారణంగా ఇక్కడ పైపులైను కొట్టుకుపోయింది. సమస్యకు శాశ్వత పరిష్కారంగా పైపులైను కొట్టుకుపోయే ప్రదేశంలో మైనర్ బ్రిడ్జిని నిర్మాణం చేస్తే సమస్య పునరావతం కాదని అధికారులు చేసిన సూచనలతో కొంతమేర బ్రిడ్జి నిర్మాణం చేపట్టారు. పైపులైను కోసం నిర్మించిన బ్రిడ్జి అసంపూర్తిగా ఉండడంతో పూర్తిస్థాయిలో బ్రిడ్జి నిర్మాణం చేపట్టి పైపులైన్ ను బ్రిడ్జి పై ఏర్పాటు చేస్తేనే ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని పంచాయతీ



పైపులైన్‌కు మరమ్మతులు చేస్తున్న కార్మికులు

పాలకవర్గ సభ్యులు భావిస్తున్నారు. దీనికోసం ఖర్చు అయ్యే నిధులను పంచాయతీలోని 15వ ఆర్థిక సంఘం లేదా గ్రామీణ నీటి సరఫరా విభాగం నుంచి మంజూరు చేయాలని సర్పంచి మద్దిరాల మమత, పాలకవర్గం సభ్యులు కోరుతున్నారు.

పోలీసుల ఆంక్షలు విడ్డూరం : స్వామి

ప్రజాశక్తి-పొన్నలూరు

అనుమతులు తీసుకున్నప్పటికీ పోలీసులు అడుగడుగునా ఆంక్షలు పెట్టడం విడ్డూరంగా ఉందని కొండపి ఎమ్మెల్యే డాక్టర్ డోలా శ్రీబాల వీరంజనేయ స్వామి ఆరోపించారు. మండల సంగమేశ్వరం దేవాలయం వద్ద టిడిపి ఆధ్వర్యంలో సోమవారం కార్తీక వనభోజనాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కార్తీక వనభోజనాలకు ముందస్తు అనుమతి తీసుకున్నప్పటికీ పోలీసులు దారి పొడవునా ప్రజలను అడ్డుకోవడం మంచిపద్ధతి కాదన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే స్వామి

అనుమల సాంబశివరావు, నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

డ్వాక్రా సభ్యుల సొమ్ము

రూ.50 లక్షలు స్వాహా

(మొదటిపేజీ తరువాయి)

కర్లపాలెంలోనే యూనియన్ బ్యాంకు తరపున మండలంలో 17 బీసీ పాయింట్లు ఉన్నాయి. ఏసుబాబు అనే వ్యక్తి పెదపులువారిపాలెం కింద బీసీ పాయింట్ కింద అప్లై చేసుకొని పెదగొల్లపాలెం పరిధిలో బీసీ పాయింట్ నడుపుతున్నాడు. డ్వాక్రా మహిళలు ప్రతి నెలా పొదుపు నగదును బ్యాంకుకు వెళ్లి కడుతున్న నేపథ్యంలో తొమ్మిది నెలల క్రితం మేనేజర్ శ్రీనివాస్.. నగదును బ్యాంక్ వచ్చి కట్టాల్సిన అవసరం లేదని పెదగొల్లపాలెంలో ఏసుబాబు నడుపుతున్న బీసీ పాయింట్‌లో కట్టి.. రశీదు తీసుకోవాలని చెప్పాడు. యారంవారిపాలెం, బత్తులవారిపాలెంలో బీసీ పాయింట్లు ఉన్నాయి. అయినా మేనేజర్ పెదగొల్లపాలెంలోని ఏసుబాబు బీసీ పాయింట్ వద్దే నగదు కట్టాలని చెప్పడంతో పెద్దగొల్లపాలెం, మార్పు చెన్నయ్యగారి పాలెం, బత్తులవారిపాలెం, పెద్ద పులుగువారిపాలెం డ్వాక్రా సభ్యులు ఏసుబాబు బీసీ పాయింట్‌లోనే డబ్బు చెల్లించి.. రశీదు తీసుకున్నారు. ఈ విధంగా తొమ్మిది నెలల నుంచి డ్వాక్రా సభ్యులు అక్కడే నగదు చెల్లిస్తున్నారు. ఈ వారంలో డ్వాక్రా సభ్యుల ఫోన్లకు రుణం చెల్లంచలేదని, వెంటనే చెల్లించాలని మెసేజ్‌లు వచ్చాయి. మెసేజ్‌లు చూసి.. ఖంగుతిన్న గ్రూపు సభ్యులు వెంటనే బ్యాంకు వద్దకు వెళ్లి.. వివరాలు అడిగారు. బ్యాంకు వాళ్లు కూడా మీరు డబ్బు కట్టినట్లు రికార్డుల్లో లేదని సమాధానమిచ్చారు. బ్యాంకు మేనేజర్ డ్వాక్రా సభ్యులకు తెలియకుండా మూడు నెలలకు ఒకసారి వారి పొదుపు ఖాతాల్లోని నగదును రుణానికి జమచేస్తున్నారు. ఈ విషయం నిత్యం బ్యాంకుకు వచ్చే సంబంధిత యానిమేటర్లకు కూడా ఎప్పుడూ చెప్పలేదు. పొదుపు ఖాతాల్లోని నగదు కూడా అయిపోవడంతో రుణం కట్టాలని గ్రూపు సభ్యులకు మెసేజ్‌లు వచ్చాయి. దీంతో తమకు న్యాయం చేయాలని డ్వాక్రా సభ్యులు బ్యాంకు వద్ద ఆందోళనకు దిగారు. కర్లపాలెం మండల పరిధిలోని నాలుగు గ్రామాలకు చెందిన దాదాపుగా 25 గ్రూపుల వద్ద నుంచి సుమారు రూ.50 లక్షల మేర నగదును వసూలు చేసి.. డమ్మీ రశీదులు ఇచ్చారని వాపోయారు. ఇదంతా బ్యాంకు తప్పిదమేనన్నారు. దీనిపై బ్యాంకు మేనేజర్ వింత సమాధానం చెబుతున్నారు. 'మీకు తెలియకుండా మీ నగదు బదిలీ చేసుకునే అధికారం మాకుంది.. మీకు సమాధానం చెప్పాల్సిన అవసరం లేదు' అంటూ స్వయం సంఘాల మహిళలపై నిర్లక్ష్యంగా బెదిరింపు ధోరణితో మాట్లాడటంతో బ్యాంకు వారికి, బీసీ పాయింట్ నిర్వాహకుడికి మధ్య అవగాహనతోనే ఈ స్కామ్ జరిగినట్లు మహిళలు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై వెంటనే జిల్లా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ ఘటనపై ఎస్టై శివయ్య, మండల ఉపాధ్యక్షులు సుబ్బారావు, సర్పంచులు సురేష్ రాధవ్ (నాని), శ్రీనివాస్ రెడ్డి, నాయకులు జయభరత్ రెడ్డి బ్యాంకు అధికారులతో మాట్లాడారు.

నకిలీ రశీదులిచ్చారు.

యూనియన్ బ్యాంక్ మేనేజర్ శ్రీనివాస్

బీసీ పాయింట్‌లో డబ్బు కట్టి.. డ్వాక్రా సభ్యులు మోసపోయిన విషయం శుక్రవారం మా దష్టికి వచ్చింది. డ్వాక్రా సంఘాల దగ్గర నుంచి అమౌంటును బీసీ పాయింట్‌కి సంబంధించిన ఏసుబాబు అనే వ్యక్తి కట్టించుకుని వాళ్లకి ఫేక్ రిసీప్ట్ ఇచ్చి మోసం చేశారు. దీనిపై మేము విచారణ చేసి.. అతనిపై పోలీసు కంప్లైంట్ ఇస్తాం. మా కస్టమర్లకు మేము న్యాయం చేస్తాం.

అభివృద్ధి పనులపై మంత్రి సమీక్ష

యర్రగొండపాలెం : నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలపై రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ సోమవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. హైదరాబాద్ నుంచి మంత్రి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో సబ్ కలెక్టర్ సేదు మాధవన్, నియోజకవర్గంలోని అన్ని మండలాలకు చెందిన అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వాకా గోవిందరెడ్డి మృతి

దర్శి : పిజిఎన్ క్లబ్ వ్యవస్థాపక ఉపాధ్యక్షుడు వాకా గోవిందరెడ్డి(76) అనారోగ్యంతో ఆదివారం ఒంగోలులోని ఓ ఆసుపత్రిలో మృతి చెందాడు. సోమవారం దర్శిలో అంత్యక్రియలు నిర్వహించారు. వాకా గోవిందరెడ్డికి పలువురు నివాళులర్పించారు. గోవిందరెడ్డి కుమార్తె మంజుల దర్శిలో న్యాయవాదిగా పనిచేస్తున్నారు.

టైరు పేలి.. లారీని ఢీకొన్న కారు

- డ్రైవర్ మృతి
- అయిదుగురికి గాయాలు
- మార్టూరు ఫ్లైవర్‌పై ప్రమాదం

ప్రజాశక్తి-మార్టూరు రూరల్

దైవదర్శనానికి వెళ్లి వస్తున్న ఓ కుటుంబం మార్టూరు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలకు గురయ్యింది. చికిత్స కోసం తరలిస్తుండగా మార్గమధ్యంలో కారు డ్రైవర్ మృతి చెందాడు. ఈ ప్రమాద ఘటన మార్టూరు పట్టణంలోని ఎక్స్‌ప్రెస్ ఫ్లైఓవర్ బ్రిడ్జిపై సోమవారం చోటుచేసుకుంది. స్టేషన్ ఇన్‌ఛార్జి సాయిరాం కథనం ప్రకారం.. కృష్ణా జిల్లా జి కొండూరు మండలం కట్టుబడిపాలెం గ్రామానికి చెందిన బూసు వెంకటరమణ తన భార్య శివపార్వతి కుమార్తెలు భార్గవి, శ్రావణి, కుమారుడు మోక్షజ్ఞ సమీప బంధువైన గట్టు నవీన్(27)తో కలిసి స్నేహితుడి కారు తీసుకొని దైవదర్శనానికి తిరుపతి వెళ్లారు. దర్శనం అనంతరం వీరు తమ కారులో విజయవాడ బయలుదేరారు. వీరు ప్రయాణిస్తున్న కారు మార్టూరు చేరుకోగానే పట్టణంలోని ఫ్లై ఓవర్ బ్రిడ్జిపై ఒక్కసారిగా టైర్ పేలడంతో అదుపు తప్పి ముందు వెళుతున్న ఐషర్ లారీని బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారు నడుపుతున్న గట్టు నవీన్ కారులోని వెంకటరమణ దంపతులు, ముగ్గురు పిల్లలు తీవ్రంగా గాయపడ్డారు. ముందు వెళుతున్న లారీ డ్రైవర్ జరిగిన ప్రమాదాన్ని గుర్తించకపోవడంతో కారుని లారీ కొద్దిదూరం ఈడ్చుకొనిపోయింది. వెనుక వస్తున్న వాహనదారులు లారీని వెంబడించి చెప్పడంతో డ్రైవర్ లారీని ఆపాడు. స్థానికులు స్పందించి కారు డోర్లు పగలగొట్టి క్షతగాత్రులను బయటకు తీశారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీస్ సిబ్బంది గురుమూర్తులు, రాజేష్, నాయక్ బ్రిడ్జిపై నిలిచిపోయిన ట్రాఫిక్‌ని క్రమబద్ధీకరించారు. గాయపడిన ఆరుగురికి 108 సిబ్బంది శోభన్, రాము ప్రథమ చికిత్స అందించి గుంటూరు సమగ్ర వైద్యశాలకు తరలిస్తుండగా మార్గమధ్యంలో కారు డ్రైవర్ గట్టు నవీన్ మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు స్టేషన్ ఇన్‌ఛార్జి సాయిరాం తెలిపారు.





సంఘటన ప్రదేశం.. మృతిచెందిన కారు డ్రైవర్ నవీన్

డ్రైవర్ అప్రమత్తతతో తప్పిన ప్రాణాపాయం

కారు టైర్ పేలడంతో అదుపుతప్పి ముందు వెళుతున్న లారీని ఢీకొట్టే క్రమంలో ప్రమాదాన్ని గుర్తించిన నవీన్ అప్రమత్తంగా వ్యవహరించి కారును పక్కకు మళ్లించడంతో కారు డ్రైవర్ వైపు లారీని బలంగా ఢీకొట్టింది. కారులోని వ్యక్తులు త్రుటిలో ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు. డ్రైవర్ మాత్రం తీవ్రంగా గాయపడి సకాలంలో చికిత్స అందక మృతి చెందాడు.

108 లేక.. సకాలంలో చికిత్స అందక

లారీని కారు ఢీకొన్న ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ నవీన్ దాదాపు గంట పాటు నరకయాతన అనుభవించాడు. ప్రమాదం జరిగిన వెంటనే 108కి పోలీసులు కాల్ చేసినప్పటికీ ఏ వాహనమూ అందుబాటులోకి రాలేదు. మార్టూరులోని మూడు వాహనాలు ఉన్నప్పటికీ అందులో ఒక వాహనానికి రిపేర్ రావడంతో షెడ్‌లో బాగు చేయిస్తున్నారు. మార్టూరులోని రెండు వాహనాలతో పాటు, సమీపంలోని ఇంకొల్లు, అద్దంకి, పర్చూరు, పంగులూరు 108 వాహనాలు వేరే కేసులకు వెళ్లడంతో గంట పాటు నవీన్ రోడ్డుపై అలాగే పడివున్నాడు. ఈ సమస్యను 108 బాపట్ల జిల్లా ఇన్‌ఛార్జి శీలం సుబ్బారావు దృష్టికి ప్రజాశక్తి తీసుకెళ్లడంతో అయన స్పందించి గుంటూరులో ఉన్న చిలకలూరిపేట 108 వాహనాన్ని మార్టూరు పంపడంతో క్షతగాత్రులను వైద్యశాలకు తరలించారు.

వైభవంగా బాలల దినోత్సవం

ప్రజాశక్తి-చీరాల

బాలల దినోత్సవ వేడుకలు సోమవారం పలు పాఠశాలల్లో ఘనంగా జరిగాయి. ఆయా పాఠశాలల్లో నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. స్థానిక పద్మశాలీయ కళ్యాణ మండపంలో రోటరీ క్లబ్ ఆఫ్ చీరాల, పిరమిడ్ బాల వికాస్ సంయుక్త ఆధ్వర్యంలో బాలల దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే కరణం బలరాం, కే బాపయ్య చౌదరి హాజరయ్యారు. కార్యక్రమంలో డిఎస్పి పీ శ్రీకాంత్, ఎన్ బాలకృష్ణ, డి నాగేశ్వరరావు, బి హేమంత్ కుమార్, మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, వైస్ చైర్మన్ బొనిగల బాబు మున్సిపల్ కమిషనర్ ఐసయ్య, పలువురు కౌన్సిలర్లు, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

– స్థానిక గ్రంథాలయంలో నెహ్రూ జన్మదిన వేడుకలు గ్రంథాలయ పాలకులు ధనమ్మ ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. తహశీల్దారు ప్రభాకర్‌రావు, డాక్టర్ పోలవరపు వెంకటప్రసాద్, నెహ్రూ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో అంజనీ కుమార్ పలువురు పాల్గొన్నారు.

– స్థానిక పేర్ల హైస్కూల్ బేతాళ సాల్మన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి రోటరీ క్లబ్ అధ్యక్షులు డాక్టర్ బాబురావు హాజరై నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో అధ్యాపకులు పావని భాను చంద్రమూర్తి, రంగారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చీరాల మునిసిపల్ కార్యాలయంలో నెహ్రూ చిత్రపటానికి ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణ మూర్తి పూల మాలలు వేసి నివాళి అర్పించారు. ఆయన వెంట మునిసిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, వైస్ చైర్మన్ బొనిగల జైసన్ బాబు, మున్సిపల్ కమిషనర్ ఐసయ్య కౌన్సిలర్లు సూరగాని లక్ష్మి, స్వాతి, గుంటూరు ప్రభాకర్‌రావు, కీర్తి వెంకట్రావు, బత్తుల అనిల్, కాంపా అరుణ్, మించాల సాంబశివరావు, ఎబినేజర్ తదితరులు పాల్గొన్నారు.

బాపట్ల రూరల్: బాపట్ల జిల్లా కేంద్రంలోని జేమ్స్ హైస్కూల్‌లో సోమవారం జాతీయ బాలల దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. చిన్నారులు పలు రకాల వేషధారణల్లో కనువిందు చేశారు. డైరెక్టర్ ఆదేళ్ల విజయ్ కుమార్ మాట్లాడుతూ చిన్నారుల్లో జాతీయ సమైక్యత, సమగ్రత పెంపొందించేందుకు జాతీయ నాయకుల వేషధారణలు వేయించామని తెలిపారు. పాఠశాల నుంచే పరమత సహనం, తోటి వారికి సహాయం చేసే గుణం అలవాటు చేస్తున్నామని చెప్పారు. విద్యతో పాటు నైతిక విలువల గురించి నేర్పిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, చిన్నారులు పాల్గొన్నారు. బాపట్ల మండలం వెదుళ్లపల్లి ఎంపిపి స్కూల్‌లో వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా పిల్లలు జాతీయ నాయకుల వేషధారణతో అలరించారు. అనంతరం మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కృష్ణవేణి, శైలజ, రవిబాబు, శ్యాం, అబ్దుల్ సలాం విద్యార్థులు పాల్గొన్నారు.



నెహ్రూ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే కరణం బలరాం తదితరులు

సంతమాగులూరు: మండలంలోని బండివారిపాలెం గ్రామంలో ఉన్న ఎంపీపీ ప్రాథమిక పాఠశాలలో సోమవారం బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంఈఓ వి కోటేశ్వరరావు నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచి పూండ్ల అనిల్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కోటేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పిట్లవాని పాలెం: మండలంలోని ఛందోలు గ్రామంలో గల నీలీ బంగారయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో మండల విద్యా శాఖ అధికారి వెంకటేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఇప్పుడు విద్యా శాఖ అధికారిగా ఉన్న ఆయన ఒకప్పుడు ఈ పాఠశాలలో చదువుకున్నవారే. ఇంకా ముగ్గురు ఉపాధ్యాయులు కూడా ఇక్కడ చదువుకున్నవారేనని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి బాజీ, ప్రధానోపాధ్యాయులు మురళీధరరావు, నాయకులు మునీర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రేపల్లె: భారత తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా బాలయోగి గురుకుల పాఠశాలలో వేడుకలు నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు గిరికుమారి మాట్లాడుతూ నేటి బాలలే రేపటి పౌరులని గుర్తించిన మహనీయుడు పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ అన్నారు. ఆయనకు పిల్లలంటే అమితమైన ప్రేమ అన్నారు. దేశానికి దిశ, దశ నిర్దేశించేది బాలలే అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది విద్యార్థినులు పాల్గొన్నారు.

అద్దంకి: మండలంలోని బొమ్మనంపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు వి శ్రీనివాసులు అధ్యక్షతన బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లు అర్పించారు. దేశానికి వారు చేసిన సేవలను వివరించారు. ఈ సందర్భంగా అద్దంకి నియోజకవర్గ జోనల్ ఆటల పోటీలలో విజేతలైన విద్యార్థులకు అభినందనలు తెలిపారు. టెన్నికాయిట్ సీనియర్ బాలురు (ప్రథమ స్థానం) జి మణికంఠతేజ, పి హేమంత్ టెన్నికాయిట్ సీనియర్ బాలికలు (ప్రథమ స్థానం) సిహెచ్ వైష్ణవి, టి మంజుల టెన్నికాయిట్ జూనియర్ బాలికలు (ప్రథమ స్థానం), పి భవ్యహర్షిత, కె లక్ష్మీత్రివేణి విజేతలుగా నిలిచి జిల్లా స్థాయి ఆటల పోటీలకు ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎస్ నాగేశ్వరరావు, కోవి శ్రీనివాసరావు, ఎన్ కుమారస్వామి, పి శంకరరావు, పి వెంకటరావు, పిఈటి కె హనుమంతరావు, జ్యోతి శ్రీమన్నారాయణమూర్తి పాల్గొన్నారు. కార్యక్రమ అనంతరం కార్తీకమాస వనభోజనాలు జరిగాయి.

ఇంకొల్లు రూరల్: ఇంకొల్లు ఉర్దూ పాఠశాల ఆవరణలో జాతీయ బాలల దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి మండల విద్యాశాఖ అధికారి ఎం సత్యనారాయణ అధ్యక్షత వహించి బాలల దినోత్సవ ప్రాముఖ్యత గురించి తెలియజేశారు. భవనం శ్రీనివాస్‌రెడ్డి, బండారు ప్రభాకర్‌రావు, ఎన్ఆర్ఐ రాయిని సుబ్బారామయ్య మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సన్మాన గ్రహీతలు ఖాదర్ హుస్సేన్, ఆవులమంద వెంకటసుబ్బయ్య పాఠశాల ఉపాధ్యాయులు సత్కరించారు. ముఖ్య అతిథులుగా జడ్పిటిసి సభ్యులు (శ్రీలక్ష్మి, మాజీ జెడ్పిటిసి ఎంపిపి భవనం శ్రీనివాసరెడ్డి, ఎంపిపి బండారు అనూష, వైస్ ఎంపిపి తోమాటి చలమయ్య, ఎంపిటిసి సభ్యులు షేక్ ఆయేషా బుడే, డిప్యూటీ డిఇఒ ఏ కిరణ్‌కుమార్, ఇంకొల్లు ఎస్ఐ నాయబ్ రసూల్, మండల వైసిపి కన్వీనర్ బండారు ప్రభాకర్, ఉర్దూ స్కూల్ హెచ్ఎం భవనం హరేరామిరెడ్డి, రాయిని సుబ్బారామయ్య తదితరులు పాల్గొన్నారు.

పంగులూరు: బాలల దినోత్సవం సందర్భంగా భారత మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ జయంతి వేడుకలు సోమవారం రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో పంగులూరులో ఘనంగా జరిగాయి. పండిట్ నెహ్రూ విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. రోటరీ క్లబ్ కల్చరల్, మెడికల్ క్యాంపు చైర్మన్ చిలుకూరి వీరరాఘవయ్య, మండల అభివృద్ధి కమిటీ అధ్యక్షులు రాయిని వెంకట సుబ్బారావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి రాయిని ప్రమీల వెంకట సుబ్బారావు, రోటరీ సభ్యులు గుర్రం ఆంజనేయులు, ఇమ్మడిశెట్టి సుబ్బారావు, గ్రామ వైసిపి నాయకులు గుడిపూడి రామారావు, చిలుకూరి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

మోటార్ల నుంచి రాగి తీగ చోరీ

ప్రజాశక్తి-సంతమాగులూరు: మండలంలోని బండివారిపాలెం గ్రామ పొలాలల్లో రైతులు తమ మెట్ట భూములలో సాగు చేసే పంటలను నీటి ద్వారా కాపాడుకోవడానికి వేసిన బోరింగ్ మోటార్లను, ఆదివారం అర్ధరాత్రి మోటార్లను ధ్వంసం చేసి అందులో ఉండే రాగి తీగను చోరీ చేశారని బాధితుడు బండి వెంకట్రావు సోమవారం ఉదయం స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. మోటార్ కింద పది ఎకరాల వరకు సాగుచేసిన, నిమ్మ, మిర్చి, పత్తి పంటలను సాగు చేసినట్లు వెంకట్రావు తెలిపారు. మోటార్ ధ్వంసం వల్ల లక్షా యాభై వేలు రూపాయల నష్టం జరిగిందని వెంకట్రావు ఆవేదన వ్యక్తం చేశారు. 7 కిలోల రాగి కోసం దొంగలు ఈ దుశ్చర్యకు పాల్పడ్డారని తెలిపారు. మోటార్ల ద్వారా పంటలను సాగుచేసే రైతులు ఆందోళన చెందుతున్నారు. పోలీసులు నిందితులను గుర్తించి శిక్షించాలని రైతులు కోరుతున్నారు.

అగ్ని బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే సాయం

ప్రజాశక్తి-రేపల్లె: అగ్ని బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్, ఆధ్వర్యంలో టిడిపి నాయకులు చేయూత కార్యక్రమాన్ని నిర్వహించారు. రేపల్లె మండలంలోని రాజుకల్వ గ్రామంలో విద్యుత్ సర్క్యూట్ వలన ఇల్లు కాలిపోయిన సంగడి దుర్గాప్రసాద్ కుటుంబానికి వంట సామగ్రి, నిత్యావసర సరుకులు రూ.10,000 అందించారు. మండల టిడిపి అధ్యక్షుడు కే వెంకటేశ్వరరావు, తెలుగు యువత అధ్యక్షుడు కమతం శివ, గట్టిపాటి చినబాబు, చిప్పల పార్థసారథి ఆర్థిక సాయం అందించారు.

16న చలో పొన్నూరు

ప్రజాశక్తి-బాపట్ల రూరల్: పొన్నూరు బియ్యం వ్యాపారి అంజి బర్కబాసు హత్య అమానుషమని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు శీలం రోజన్‌బాబు అన్నారు. సోమవారం బాపట్ల అంబేద్కర్ భవన్ వద్ద జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బర్కబాసు కుటుంబ సభ్యులను పరామర్శించడానికి 16న విసికె పార్టీ జాతీయ తిరుమా వలవన్ పొన్నూరు విచ్చేస్తున్నారన్నారు. కావున దళిత సంఘాలు పొన్నూరు చేరుకోవాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు జిల్లా అధ్యక్షులు దగ్గుమల్లి శ్రీకర్, దళిత నాయకులు సలగల చంటిబాబు, ఎం మదన్ పావనకుమార్, అంబు కొప్పోలు సురేంద్ర, వర్మ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయ వారోత్సవాలు

ప్రజాశక్తి-కొల్లూరు: కొల్లూరు, అనంతవరం గ్రంథాలయాల్లో 55వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు సోమవారం ఘనం గా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథు లుగా జెడ్పీటీసీ సభ్యులు చొప్పర సుబ్బారావు, వైస్ ఎంపీపీ మురాల రాంబాబు, వైసిపి నాయకులు కమ్మెల సాంబశివరావు పాల్గొన్నారు. జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేశారు. మురాల రాంబాబు జ్యోతి ప్రజ్వలన చేసి ఘనంగా నివాళులు అర్పించారు.

అవకతవకలకు పాల్పడితే చర్యలు

ప్రజాశక్తి-రేపల్లె: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద ప్రభుత్వం చేపట్టిన పనులపై ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ కె శంకర్ నాయక్ సంబంధిత అధికారులకు ఆదేశించారు. సోమవారం రేపల్లె మండల ప్రజా పరిషత్ కార్యాలయ ఆవరణలో 14,15 విడతలకు సంబంధించి సామాజిక తనిఖీ కార్యక్రమాన్ని నిర్వహించారు.

జీతాలు విడుదల చేయాలని వినతి

సంతమాగులూరు: మండలంలోని ఏల్చూరు గ్రామ పారిశుధ్య కార్మికులకు, రెండు సంవత్సరాల, ఆరు నెలలకు జీతాలు ఇంతవరకు అందలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో కుటుంబ పోషణ ఇబ్బందిగా మారిందని సోమవారం ఏల్చూరు గ్రామ పారిశుధ్య కార్మికులు ఎంపీడీ వో ఎం సాంబశివరావుకు వినతిపత్రం అందజేశారు.

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు

ప్రజాశక్తి-నిజాంపట్నం: గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని ఎంపిపి మోపిదేవి విజయ నిర్మల హరినాథ్ బాబు అన్నారు. సోమవారం నిజాంపట్నం శాఖ గ్రంథాలయంలో 55వ గ్రంథాలయ వారోత్సవాలను ముఖ్యఅతిథిగా ఆయన హాజరై నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి ప్రారంభించారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయకృష్ణన్

గృహ నిర్మాణాలపై కలెక్టర్ సమీక్ష

ప్రజాశక్తి-చుండూరు

చుండూరు ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో చుండూరు, అమర్తలూరు మండలాల ప్రజాప్రతినిధులు అధికారులతో జగనన్న కాలనీ గృహ నిర్మాణాలపై బాపట్ల జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ రెండు మండలాల అధికారులను గృహ నిర్మాణాల గురించి గ్రామ కార్యదర్శులను, గ్రామ సచివాలయ సిబ్బంది, ఇంజనీరింగ్ అసిస్టెంట్లను అడిగి తెలుసుకున్నారు. గృహ నిర్మాణంలో వెనుకబడిన గ్రామాలను వెంటనే నిర్మించాలని, ప్రజాప్రతినిధులకు, అధికారులకు సచివాలయ సిబ్బంది ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు సూచించారు. చుండూరు మండలంలో ఉన్న గృహాలు నిర్మించి లేఅవుట్లను పరిశీలించారు. ఈ కార్యక్రమాన్ని చుండూరు సర్పంచ్ ఉయ్యూరు అప్పిరెడ్డి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చుండూరు జడ్పిటిసి సౌజన్య, ఎంపిపి జాలాది రూబేన్, సర్పంచులు, ఎంపిటిసి మెంబర్లు పాల్గొన్నారు. చుండూరు ఎమ్మార్వో డి కనకదుర్గ, ఎంపీడీవో సుగుణమ్మ పాల్గొన్నారు.

వైద్య శిబిరాన్ని వినియోగించుకోవాలి

ప్రజాశక్తి-నిజాంపట్నం

కూచినపూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో మండలంలోని బొర్రావారిపాలెంలో ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ క్యాంపు సోమవారం డాక్టర్ పి ఉషారాణి వైద్య సేవలు అందించారు. ఈ కార్యక్రమంలో బొర్రావారిపాలెం సర్పంచ్ కేశవ ముత్యాలమ్మ సోమయ్య మాట్లాడుతూ పంచాయతీ ప్రజలు అనారోగ్యం ఉంటే వైద్య శిబిరానికి వచ్చి పరీక్షలు చేయించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌వి మాధవి, ఏఎన్ఎం రేష్మ, ఎంఎల్‌హెచ్ఓ దివ్య, పంచాయతీ కార్యదర్శి వీరాస్వామి, అంగన్‌వాడీ వర్కర్లు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

రూ.8.70 కోట్ల మండల బడ్జెట్‌కు ఆమోదం

ప్రజాశక్తి-బల్లికురవ

రానున్న ఆర్థిక సంవత్సరానికి రూ.8,70,26,846 బడ్జెట్‌ను సోమవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశం ఏకగ్రీవంగా ఆమోదించింది. ఎంపిపి బడుగు శ్రీలక్ష్మి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో 2023-24 ఆర్థిక సంవత్సర బడ్జెట్‌ను రూ.8.70 కోట్లతో ప్రతిపాదించి ఆమోదించారు. సాధారణ పద్దుల ద్వారా రూ.5 కోట్ల పైబడి ఆదాయం అంచనా వేయగా అదే పద్దు ద్వారా రూ.3.35 కోట్లు ఖర్చు అవుతుందని అంచనా వేశారు. మొత్తం 11 పద్దుల ద్వారా ఆదాయ, వ్యయాలను అంచనా వేసి రూ.1.65 కోట్లు మిగులు బడ్జెట్‌గా చూపారు. కార్యక్రమంలో ఎంపిడిఓ కృష్ణ, జడ్పిటిసి, వైస్ ఎంపిపి సుబ్బారెడ్డితో బాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఎన్‌టిఆర్ జయంతి ఉత్సవాలు

ప్రజాశక్తి-అద్దంకి

ఎన్టీఆర్ కళాపరిషత్, నందమూరి కళాపరిషత్, అద్దంకి సాహితీ సాంస్కృతిక సేవా సంస్థల ఆధ్వర్యంలో ఈ నెల 13 నుంచి 20వ తేదీ వరకు 8 రోజులపాటు జరగతున్న ఎన్టీఆర్ శతజయంతి ఉత్సవాల్లో భాగంగా రెండోరోజు సోమవారం అద్దంకి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో అత్యంత వైభవంగా జరిగాయి. ముందుగా రేణింగవరం మండల పరిషత్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు సందిరెడ్డి శ్రీహరి, కే అనంతారెడ్డి మాస్టర్ బృందం ఆధ్వర్యంలో విద్యార్థులచే కోలాట ప్రదర్శన ఆకట్టుకున్నది. శ్రీ ప్రసన్నాంజనేయ నాదస్వర సమాజం వారిచే గోనగుంట్ల రామాంజనేయులు మాస్టర్ బృందం ఆధ్వర్యంలో జరిగిన నాదస్వర కచేరి ప్రేక్షకులకు వీనులవిందు చేసింది. నాదస్వర కచేరిలో ఏల్చూరి సత్యనారాయణ, శంకవరపు ప్రసన్నకుమార్, ఉప్పుటూరు ఏడుకొండలు, గోనుగుంట్ల రామాంజనేయులు, రాచమల్లు రామాంజమ్మ పాల్గొన్నారు. వివిధ పాఠశాలల విద్యార్థులచే డాన్స్ పోటీలు జరిగాయి. సృజన సాహిత్య సంస్థ ఆధ్వర్యంలో జరిగిన కవి సమ్మేళన కార్యక్రమం ఆకట్టుకుంది. సిద్ధేంద్ర కళా పీఠం కూచిపూడి వారి ఆధ్వర్యంలో వాగ్దేవి ప్రసాద్ బృందం ప్రదర్శించిన నర్తనశాల నృత్య రూపకం సభికులను కట్టిపడేసింది. ఈ నృత్య రూపకానికి వేదాంతం రామలింగశాస్త్రి రచన, సంగీతం, దర్శకత్వం వహించారు. విరాటపర్వంలోని మారువేషంలో పాండవులు, భీమసేనుడు జరాసంధుని హతమార్చడం మొదలగు భారతంలోని పలు ఆసక్తికర అంశాలతో ఈ నృత్య రూపకం అలరించింది.

స్పందన అర్జీలు పరిష్కరించాలి: కలెక్టర్

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా



స్పందనలో ప్రజల నుంచి అర్జీలు తీసుకుంటున్న కలెక్టర్

స్పందన అర్జీలు గడువులోగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ అధికారులను ఆదేశించారు. సోమవారం బాపట్ల కలెక్టరేట్‌లో స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రజలు నుంచి వచ్చిన అర్జీలను వేగవంతంగా పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని చెప్పారు. గడువులోగా పరిష్కరించని అధికారులపై చర్యలు తీసుకుంటామని కలెక్టర్ చెప్పారు. స్పందన కార్యక్రమంలో 127 అర్జీలు వచ్చాయన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కె శ్రీనివాసులు, జిల్లా రెవెన్యూ అధికారి లక్ష్మీ శివ జ్యోతి, సిపిఓ భరత్ కుమార్, రవాణా శాఖ అధికారి చంద్రశేఖర్‌రెడ్డి, జిల్లా సహకార అధికారి రామారావు, పశుసంవర్ధక శాఖ జెడి హనుమంతరావు, మత్స్య శాఖ జెడి సురేష్, జిల్లా విద్యాశాఖ అధికారి రామారావు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి విజయమ్మ, పౌర సరఫరాల శాఖ డిఎం శ్రీలక్ష్మీ, డిఎస్ఓ విలియమ్స్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఎస్‌పి 'స్పందన'

బాపట్ల జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో జిల్లా ఎస్‌పి వకుల్ జిందాల్ 'స్పందన' కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలోని పలు ప్రాంతాల ప్రజలు జిల్లా పోలీస్ కార్యాలయానికి వచ్చిన తమ సమస్యలను స్వయంగా జిల్లా ఎస్పీకి విన్నవించుకున్నారు. వారి సమస్యలు క్షుణంగా విని, ఫిర్యాదులను పరిశీలించి సంబంధిత పోలీస్ అధికారులతో మాట్లాడి ఫిర్యాదులపై చట్టపరంగా విచారణ జరిపి, భాదితులకు న్యాయం చేయాలని ఎస్‌పి ఆదేశించారు. స్పందనలో ఫిర్యాదు చేసిన వ్యక్తి పదేపదే పోలీసు స్టేషన్‌ల చుట్టూ తిరగాల్సిన పరిస్థితులు ఉండకూడదని, పోలీస్ అధికారులే స్వయంగా బాధితుల వద్దకు వెళ్లి ఆ ప్రదేశంలో విచారించి సకాలంలో చట్టపరిధిలో సమస్యలను పరిష్కరించి వారికి న్యాయం చేయాలని పోలీస్ అధికారులను ఎస్‌పి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ పి మహేష్, స్పందన ఇన్‌స్పెక్టర్ వి మాలకొండయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

మురుగునీరు తొలగించిన అధికారులు

ప్రజాశక్తి-చీరాల



పైపులైన్లతో మురుగునీరు తొలగింపు చర్యలు చేపట్టిన కమిషనర్ ఐసయ్య

ప్రజాశక్తి కథనానికి స్పందన

ఇళ్ల చుట్టూ మురుగు నీరు చేరి రైల్వే ట్రాక్ సమీపంలో ఉన్న వార్డు ప్రజలు రోగాల బారిన పడుతున్నారని ఆదివారం ప్రజాశక్తి దినపత్రికలో 'మురుగు నీటితో సహజీవనం' అనే కథనానికి మున్సిపల్ అధికారులు సోమవారం స్పందించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ ఐసయ్య 18,20,21, వార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైల్వే ట్రాక్ సమీపాన మురుగునీటిని ప్రధాన కాలువకు కలిపే తరుణంలో గతంలో వేసిన పైపులైన్లను రైల్వే శాఖ వారు వారి పనులు చేపట్టే క్రమంలో పగుల కొట్టారన్నారు. వారిని పలుమార్లు మరమ్మతులు చేయించాలని కోరినా స్పందించకపోవటంతో పారిశుధ్య కార్మికులతో పైపులను మరమ్మతులు చేయించామన్నారు. ఈ పైపుల ద్వారా మురుగునీరు దండుబాటలోని ప్రధాన కాలువకు చేరుతుందని అన్నారు. ఆయన వెంట శానిటరీ సిబ్బంది ప్రవీణ్ కుమార్, అవ్వారు వరదయ్య పలువురు ఉన్నారు.

సిఐటియు మహాసభలను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-చీరాల



మాట్లాడుతున్న సిఐటియు జిల్లా కార్యదర్శి మజుందార్

సిఐటియు బాపట్ల జిల్లా మహాసభలు డిసెంబరు 10,11 తేదీల్లో చీరాలలో జరుగుతాయని వాటిని జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి సిహెచ్ మజుందార్ అన్నారు. సోమవారం సిఐటియు చీరాల పట్టణ తృతీయ మహాసభ స్థానిక ఎన్జీవో హోంలో జరిగింది. ఈ మహాసభకి అధ్యక్షవర్గంగా పీ రేఖ ఎలిజిబెత్, వై సింగయ్య అధ్యక్షత వహించారు. ఈ మహాసభను ఉద్దేశించి సిఐటియు జిల్లా కార్యదర్శి సిహెచ్ మజుందార్ మాట్లాడుతూ సిఐటియు బాపట్ల ప్రథమ మహాసభలు చీరాల పట్టణంలో జరగనున్నాయి. ఈ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. కార్మిక వర్గం, ఉద్యోగులు సాధించుకున్న హక్కులను కార్మిక చట్టాల మార్పు ద్వారా తీసి వేస్తున్నారన్నారు. ప్రైవేటీకరణ పేరుతో ప్రజలు సృష్టించిన సంపదని కార్పొరేట్లకు కట్టబెడుతున్నారని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో జిల్లా కార్మిక ఉద్యమానికి ఒక మైలురాయిగా ఈ ప్రథమ మహాసభ వేదిక కానుందని అన్నారు. సిఐటియు పట్టణ కమిటీని ఎన్నుకున్నారు. పట్టణ కమిటీ అధ్యక్షుడిగా ఎన్ బాబురావు, కార్యదర్శిగా ఎం వసంతరావు, కోశాధికారిగా ఆర్ఎస్ రామిరెడ్డి మరో పదకొండు మంది కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు.

జర్నలిస్టుల పట్ల చిన్నచూపు తగదు: అనగాని

ప్రజాశక్తి-రేపల్లె: రాష్ట్రంలో జర్నలిస్టుల పట్ల ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చిన్నచూపు చూస్తున్నారని రేపల్లె శాసనసభ్యులు అనగాని సత్యప్రసాద్ విమర్శించారు. సోమవారం మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. జర్నలిస్టులంటే వైసీపీ ప్రభుత్వానికి, నాయకులకు ఏమాత్రం గౌరవం లేకుండా వ్యవహరిస్తోందని అన్నారు. సమాజానికి ఉపయోగపడని సలహాదారుల సంక్షేమంపై పెట్టిన శ్రద్ధ, సమాజం కోసం తమ జీవితాలను త్యాగం చేస్తున్న జర్నలిస్టులపై జగన్‌రెడ్డికి గౌరవం లేదని విమర్శించారు. ఎన్నికల సమయంలో జర్నలిస్టులకు జగన్‌రెడ్డి ఇచ్చిన హామీల్లో ఒక్క హామీని కూడా అమలు చేయలేదని పేర్కొన్నారు. అధికారంలోకి వచ్చిన సంవత్సరమున్నర కాలం వరకు జర్నలిస్టులు కనీసం అక్రిడిటేషన్ కార్డుకు నోచుకోలేదన్నారు. జర్నలిస్టులకు కొర్రీలు పెట్టి అక్రిడిటేషన్లను ప్రభుత్వం కుట్రపూరితంగా నిలిపేసిందన్నారు. అధికారంలోకి వస్తే జర్నలిస్టులకు ఇళ్లస్థలాలు ఇస్తామన్న హామీని జగన్‌రెడ్డి గాలికొదిలేశారన్నారు. కరోనాతో మరణించిన జర్నలిస్టుల కుటుంబాలకు ప్రభుత్వం నుంచి కనీస సాయం అందించలేదని విమర్శించారు. పక్క రాష్ట్రాల ప్రభుత్వాలు జర్నలిస్టులకు అన్నివిధాలా అండగా నిలబడుతున్నాయని, ఎపిలో మాత్రం జర్నలిస్టులకు ఆరోగ్య బీమా కూడా ఇవ్వలేని దుస్థితిలో వైసీపీ ప్రభుత్వం ఉండడం సిగ్గుచేటని పేర్కొన్నారు.

పావులూరులో ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-ఇంకొల్లు రూరల్

ఇంకొల్లు మండలం పావులూరులో ప్రపంచ డయాబెటిస్ సందర్భంగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. మాజీ సర్పంచ్ పులఖండం బద్రిరెడ్డి శిబిరాన్ని ప్రారంభించారు. ది ఇంకొల్లు మండల హెల్త్ ఫస్ట్ ఎయిడర్స్, శ్రీ బాలాజీ మల్టీ స్పెషాలిటీ చీరాల వారి సహకారంతో బిపి, షుగర్ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో 200 మందికి వైద్య పరీక్షలు చేసినట్లు సొసైటీ అధ్యక్షులు రావినూతల శ్రీనివాసరావు వివరించారు. కార్యక్రమంలో గ్రామీణ వైద్యులు నాగేశ్వరరావు, భానుతేజ, దాసు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాసుపత్రికి పరికరాలు అందజేత

ప్రజాశక్తి-పర్చూరు

రోటరీక్లబ్ ఆఫ్ పర్చూరు ఆధ్వర్యంలో తానా (అమెరికా) సహకారంతో పర్చూరు ప్రభుత్వాసుపత్రికి రూ.3 లక్షల విలువ చేసే ఇసిజి, రక్త పరీక్ష వైద్య పరికరాలను సోమవారం అందించారు. తానా కోశాధికారి కొల్లా అశోక్‌బాబు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా అశోక్‌బాబు మాట్లాడుతూ ఆసుపత్రి నిర్వహణ బాగుందని, ఇంకా మెరుగైన వైద్య సౌకర్యాలు అందించాలని భవిష్యత్తులో తన వంతు సేవలందించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అడిగిన వెంటనే స్పందించి వైద్య పరికరాలను అందించిన తానా వారికి రోటరీ వారికి ఆసుపత్రి సూపరింటెండెంట్ ఇ గురుమహేశ్వరరెడ్డి, డాక్టర్ ఇ సింధు దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రోటరీ అధ్యక్షులు నాగభైరు శ్రీనివాసరావు, కార్యదర్శి పంబి సదానందరెడ్డి, కోశాధికారి కాసా అశోక్‌బాబు, సభ్యులు రావి సత్యనారాయణ, గడ్డిపాటి శ్రీనివాసరావు, నర్రా వెంకటేశ్వరరావు, పాబోలు ఉదయభాస్కర్, పి చంద్రం, కె ఆంజనేయులు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

నేడు కారంచేడులో ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-కారంచేడు

కారంచేడులోని రామానాయుడు కల్యాణ మండపంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఎంపిపి నీరుకట్టు వాసు బాబు, జడ్పిటిసి యార్లగడ్డ రజినీ తెలిపారు. ఒంగోలు కిమ్స్ హాస్పిటల్ వారి సహకారంతో ఈ వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఉదయం 9 గంటలకు ఈ వైద్య శిబిరం ప్రారంభమవుతుందని చెప్పారు. ఈ వైద్య శిబిరంలో కంటి వైద్యం, గుండె, కిడ్నీలు ఎముకలు కీళ్ళు, నరములు, గర్భాశయ వ్యాధులు, ప్లాస్టిక్ సర్జరీకి సంబంధించిన వైద్యులు పాల్గొని అవసరమైన వారికి ఉచితంగా ఆపరేషన్లు కూడా చేస్తారని, మందులు అవసరమైన వారికి ఇస్తారని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలంతా వినియోగించుకోవాలని కోరారు.

మెగా జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి-పిట్టలవాని పాలెం

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళాను ఏర్పాటు చేస్తున్నారని ఖాజీపాలెం పంచాయతీ సర్పంచ్ కుంఠం అనూష తెలిపారు. బాపట్ల శాసనసభ్యులు కోన రఘుపతి ముఖ్య అతిథిగా పాల్గొంటారని పేర్కొన్నారు. కెవిఆర్ కెవిఆర్ అండ్ ఎంకెఆర్ కళాశాల ఖాజీపాలెంలో ది18-11-2022 శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు నిర్వహించే బడేజాబ్ మేళాను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకొని వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని అన్నారు. ఈ సువర్ణ అవకాశాన్ని అనేక కంపెనీలు నిరుద్యోగులకు అందిస్తున్నాయని పేర్కొన్నారు.

బాలల హక్కుల పరిరక్షణ తప్పనిసరి: పీడీ

ప్రజాశక్తి-బాపట్ల రూరల్: బాలల హక్కుల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని ఐసిడిఎస్ బాపట్ల జిల్లా పీడి బి శైలజ అన్నారు. సోమవారం బాపట్ల ఐసిడిఎస్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. నేటి నుంచి వారం రోజుల పాటు బాలల హక్కుల వారోత్సవాలు నిర్వహించాలన్నారు. బాలల అభివృద్ధి కోసం పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో వివేకా ఫౌండేషన్ ఎన్‌జీఓ హోమియో వైద్యులు ఆనంద్, కలెక్టర్ సీసీ చైతన్య, ప్రథమ్ ఆర్గనైజేషన్ ప్రతినిధి సుభాని, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

అందరికీ సంక్షేమ పథకాలు: మోపిదేవి

ప్రజాశక్తి-చెరుకుపల్లి: సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికీ అందుతున్నాయని రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకట రమణరావు అన్నారు. గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని సోమవారం ఆరుంబాక పంచాయతీ పరిధిలోని ఏమినేనివారిపాలెం గ్రామంలో నిర్వహించారు. వచ్చే ఎన్నికల్లో తప్పనిసరిగా తమను ఆదరించాలని ఆయన ప్రజలను కోరారు. కార్యక్రమంలో మండల పరిషత్ అధ్యక్షులు మట్టి దివాకర్ రత్న ప్రసాద్, జడ్పిటిసి సభ్యులు మర్రివాడ వెంకట పావని, గ్రామ సర్పంచ్ కామినేని కోటేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యులు రావూరి సునీత శివ నాగేశ్వరరావు, కౌతరపు గణేష్ శ్రీనివాస్, కర్ర ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

పశువుల సంత కాదు..కూరగాయల మార్కెట్టే..!

ప్రజాశక్తి - ఒంగోలు సబర్బన్

ఈఫోటోలో కనిపిస్తున్న దృశ్యం ఊరచెరువులోని దామోదర సంజీవయ్య కొత్త కూరగాయల మార్కెట్‌లోనిది. మార్కెట్‌లోని కూరలు అమ్ముకునే వ్యాపారుల కోసం ఇక్కడ షెడ్లు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఆషెడ్లు మేకల ఆవాస కేంద్రాలుగా తయారయ్యాయి. తమకు కేటాయించిన షాపుల్లో వ్యాపారం సాగడం లేదని పలువురు వ్యాపారులు తమ దుకాణాలను బహిరంగంగా పెట్టుకుంటున్నారు. ఒకరిని చూసి ఒకరు షాపులను వదిలి ఖాళీ ప్రదేశంలో దుకాణాలు పెట్టుకుంటున్నారు. ఆకు కూరలు అమ్ముకునే పలువురు చిరు వ్యాపారులు తాము వ్యాపారం



కూరగాయల మార్కెట్‌లో తిరుగుతున్న మేకలు

చేసుకునేందుకు షెడ్లు కట్టించి ఇవ్వాలని గతంలో అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. దీంతో అధికారులు మార్కెట్‌లో కొన్ని షెడ్లు కట్టించి ఇచ్చారు. ప్రస్తుతం ఆషెడ్‌లలో ఎలాంటి వ్యాపారాలు జరగడం లేదు. అటు కూరగాయల వ్యాపారులు, ఇటు ఆకు కూరల వ్యాపారులు ఎవరూ వాటిని వినియోగించడం లేదు. దీంతో పలువురు పశువుల కాపరులు ఈషెడ్లలోనే మేకలు, గొర్రెలను పెంచుకుంటున్నారు. కొత్తగా మార్కెట్‌కు కూరగాయలు కొనుగోలు చేసేందుకు వచ్చిన వారు ఇది చూసి ముక్కున వేలేసు కుంటున్నారు. లక్షలాది రూపాయల వెచ్చించి వ్యాపారుల కోసం షెడ్లు నిర్మిస్తే చివరకు అవి పశువుల కొస్టాలుగా మారడం పట్ల పలు విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

బాలల హక్కుల పరిరక్షణకు చర్యలు : కలెక్టర్

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

బాలల హక్కుల పరిరక్షణకు చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ దినేష్ కుమార్ తెలిపారు. జాతీయ బాలల దినోత్సవం సందర్భంగా ఐసిడిఎస్ ఆధ్వర్యంలో ఈ నెల 20 వరకూ నిర్వహించే బాలల హక్కుల వారోత్సవాలకు సంబంధించిన పోస్టర్‌ను సోమవారం ఆవిష్కరించారు. నవంబరు నెలను అంతర్జాతీయ దత్తత మాసంగా కూడా నిర్వహిస్తున్నందున బాలల స్వేచ్ఛకు చిహ్నంగా పావురాలను గాలిలోకి ఎగురవేశారు. అనంతరం స్పందన హాలులో నెహ్రూ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బాల్య వివాహాలను నివారించేలా, ప్రతి బాలిక కనీసం 18 ఏళ్ల వరకు విద్యాభ్యాసం కొనసాగించేలా 'బాలికా వికాసం' పేరుతో జిల్లా యంత్రాంగం ఇప్పటికే ప్రత్యేక చర్యలు చేపట్టిందన్నారు. సచివాలయ పరిధిలో జరిగే ప్రతి వివాహానికి సంబంధించిన వివరాలు నమోదు చేసుకునేలా మహిళా పోలీసుకు ప్రత్యేక ఆదేశాలు కూడా జారీ చేశామన్నారు. అనంతరం బాల సదన్ లోని చిన్నారులు కలెక్టరుకు గులాబీ పూలు ఇచ్చి కతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంయుక్త కలెక్టర్ ఎం.అభిషిక్త్ కిషోర్ , డి.ఆర్.ఓ. బి.చిన ఓబులేసు, ఐ.డి.సి.ఎస్. పి.డి. ధనలక్ష్మీ, డిఇఒ విజయ భాస్కర్, బాలల సంక్షేమ కమిటీ ఛైర్ పర్సన్ వి.రామాంజనేయులు పాల్గొన్నారు.

రూ.50 వేల ఆర్థిక సాయం

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న బాధితుడికి రాష్ట్ర పురపాలక పట్టణాభివద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ రూ. 50 వేల ఆర్థిక సహాయం అందజేశారు. త్రిపురాంతకం మండలం అన్నసముద్రం బస్టాండ్ వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మరణించగా, బడిపాటి బెంజిమెన్ తీవ్రంగా గాయపడి గుంటూరు వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు. ఈ విషయం గురించి తెలుసుకున్న మంత్రి సురేష్ వైద్యులతో మాట్లాడి క్షతగాత్రుడికి మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. వైద్య ఖర్చులకోసం రూ.50 వేల ఆర్థిక సాయాన్ని బాధిత కుటుంబానికి అందజేశారు.

ఘనంగా బాలల దినోత్సవ వేడుకలు

ప్రజాశక్తి-దర్శి

విద్యార్థులు విద్యలో రాణించి భవిష్యత్ తరాలకు ఆదర్శంగా నిలవాలని జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ తెలిపారు. స్థానిక ఆదర్శ పాఠశాలలో ప్రిన్సిపల్ హసీనాభాను అధ్యక్షతన బాలల దినోత్సవ వేడుకలు సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా బూచేపల్లి వెంకాయమ్మ మాట్లాడుతూ దేశ తొలి ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ పుట్టినరోజు సందర్భంగా బాలల దినోత్సవం జరుపుకోవడం అభినందనీ యమన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పాఠశాలల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. తొలుత నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ కుసుమకుమారి, ఎంఇఒ కె రఘురామయ్య, వైస్ ఎంపిపి సోము దుర్గారెడ్డి, షేక్ కార్పొరేషన్ డైరెక్టరు డాక్టర్ ఎస్‌ఎం. బాషా మాజీ ఎంపిపి ఇత్తడి దేవదానం, దర్శి మాజీ సర్పంచి చంద్రగిరి గురవారెడ్డి, ఎస్‌ఎంసి చైర్మన్ శ్రీను, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. **మార్కాపురం :** భారత మాజీ ప్రధాని జవహార్‌లాల్ నెహ్రూ స్ఫూర్తితో విద్యార్థులు జీవితాన్ని ఉన్నతంగా మలుచుకోవాలని ఎమ్మెల్యే కుందురు నాగార్జునరెడ్డి తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడుఏ ఎం. చంద్రశేఖరరెడ్డి అధ్యక్షతన నెహ్రూ జయంతి సందర్భంగా సోమవారం బాలల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి మాట్లాడుతూ నెహ్రూ



దర్శిలో మాట్లాడుతున్న బూచేపల్లి వెంకాయమ్మ



మార్కాపురంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాగార్జున రెడ్డి

దేశానికి అందించిన సేవలను కొనియాడారు. తొలుత నెహ్రూ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళుర్పించారు. ఈ కార్యక్రమంలో సంగీత స్నేహ నాట్య అకాడమీ వ్యవస్థాపకులు ప్రతిమ సునీల్, బాలికల పాఠశాల సంగీత మాస్టర్ షేక్ ఖాసిం, మున్సిపల్ చైర్మన్ చిర్లంచెర్ల బాలమురళీకృష్ణ, పేరెంట్స్ కమిటీ అధ్యక్షుడు కుందురు శ్రీనివాసరెడ్డి, ఎన్.వెంకటేశ్వర్లు, ౧ ప్రభాకర్‌రెడ్డి, రమేష్‌బాబు, రత్నరాజు, ఎస్.బాస్కర్‌రెడ్డి, సమీఉల్లా. కే.వేణుగోపాల్, కె.సోమశేఖర్‌రెడ్డి, వి. ముసలయ్య, డి.కొండయ్య. టి.వెంకటేశ్వర్లు, వై.రమేష్‌రెడ్డి, వి. ఆంజనేయులు, పి.ప్రసాద్, వినోద్, ఉషారాణి పాల్గొన్నారు. స్థానిక కిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ అన్నా కృష్ణ చైతన్య ఆధ్వర్యంలో నెహ్రూ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. స్థానిక విహెచ్ఆర్ విద్యా సంస్థల్లో వెన్నా హనుమారెడ్డి ఆధ్వర్యంలో మానసిక వికలాంగ పాఠశాలలో పండ్లు పంపిణీ చేశారు. స్థానిక ఏ1 గ్లోబల్ ఇంజనీరింగ్ కళాశాలలో కళాశాల చైర్మన్ డాక్టర్ మీర్జా షంషీర్ అలిబేగ్ ఆధ్వర్యంలో నెహ్రూ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. స్థానిక వాసవీ విద్యానికేతన్‌లో డైరెక్టర్ అండ్ ప్రిన్సిపల్ కె.రంగయ్య అధ్యక్షతన నెహ్రూ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులుర్పించారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో చాచా జవహార్‌లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా మధర్‌థెరిస్సా ఎమెన్ అండ్ చైల్డ్‌వెల్ఫేర్ సొసైటీ–హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ సంయుక్తంగా సోమవారం నిర్వహించిన వేడుకల్లో మార్కాపురం ఎమ్మెల్యే కుందురు నాగార్జునరెడ్డి పాల్గొన్నారు. **పిసిపల్లి :** భారత దేశ తొలి ప్రధాని నెహ్రూ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపా ధ్యాయుడు కె.శ్రీనివాసులు, ఎం.నరసింహం, వి.ఆశా సుధీర, ఎస్.శ్రీనివాసరావు, ఎస్‌కె.నజీరాబేగం, ఎస్.ఏసుబాబు, ఎస్‌కె.షకీలా, ఎం.మధుబాబు, జి. మాల్యాద్రి, జివి.మాల్యాద్రి, జి.ప్రసాద్, ఎస్‌కె.జరీనాబేగం, ఎస్‌కె షమ్మా, కె.సుధాకర్, బి.విజయ్ పాల్గొన్నారు. **యర్రగొండపాలెం :** భారతదేశ మొదటి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా స్థానిక కస్తూరిబా గాంధీ బాలికా విద్యాలయంలో బాలల దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ తిరుమలాదేవి, ఉపాధ్యాయులు శైలజా రాణి, సక్కుబాయి, గురమ్మ, గంగా భవని బాయి, సునంద, జ్యోతి ఫ్లోరెన్స్, మేరి సుజాత, అరుణ, అనిత పాల్గొన్నారు. **ఒంగోలు సబర్బన్** : దేశ సమగ్రతను, సార్వభౌమాధికారాన్ని పరిరక్షిస్తూ దేశాభివృద్ధికి పాటుపడిన తొలి ప్రధానిగా జవహర్‌లాల్ నెహ్రూ చరిత్ర ఘడించారని గద్దలగుంట గ్రామాభివృద్ధి కమిటీ గౌరవాధ్యక్షుడు డాక్టర్ కొల్లా నాగేశ్వరరావు పేర్కొన్నారు. గద్దలగుంటలో చాచా నెహ్రూ జయంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. తొలుత నెహ్రూ విగ్రహానికి గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం బాలల దినోత్సవం సందర్భంగా పిల్లలకు మిఠాయిలు పంచి పెట్టారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ తాడి కృష్ణలత, శ్రీకృష్ణ దేవరాయ సాహిత్య సాంస్కృతిక సేవా సమితి అధ్యక్షుడు కుర్రా ప్రసాదబాబు, గద్దలగుంట గ్రామాభివృద్ధి అధ్యక్ష, కార్యదర్శులు ఓగిరాల రాధాకృష్ణ మూర్తి, ఆరిగ శ్రీనివాసరావు, కాటా నాగేశ్వరరావు, తోటా చింటూ తదితరులు పాల్గొన్నారు. **పొదిలి :** స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో బాలల దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సంద్భంగా నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మర్రిపూడి ఎంఇఒ రంగయ్య, పొదిలి ఎంఇఒ శ్రీనివాస రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఒంగోలులో నివాళులర్పిస్తున్న డాక్టర్ కొల్లా నాగేశ్వరరావు

'స్పందన'లో 89 అర్జీలు

ప్రజాశక్తి - ఒంగోలు క్రైం



స్పందన కార్యక్రమానికి 89 అర్జీలు వచ్చినట్లు ఎస్‌పి మల్లిక గర్గ్ తెలిపారు. ఎస్‌పి కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ స్పందనలో వచ్చిన ఫిర్యాదులను అధికారులు విచారించి సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎఎస్‌పి కె.నాగేశ్వరరావు, ఎస్‌బి డిఎస్‌పి బి.మరియదాసు, డిటిసి డిఎస్‌పి రామక్రిష్ణ, ట్రాఫిక్ డిఎస్‌పి వి.శ్రీనివాసరావు, ఇన్‌స్పెక్టర్ కె.రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ కిశోర్

'విజయశ్రీ'లో ఉచిత షుగర్ పరీక్షలు

ప్రజాశక్తి-ఒంగోలు

దేవరకొండ సుబ్బయ్య మెమోరియల్ సొసైటీ మరియు విజయశ్రీ హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యంలో 60 అడుగుల రోడ్డులోని విజయశ్రీ హాస్పిటల్‌లో ప్రపంచ డయాబెటిస్ డే సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ వి. కిశోర్ ఆధ్వర్యంలో షుగర్ వ్యాధిపై అవగాహన కల్పించారు. అనంతరం ఉచితంగా షుగర్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ కిశోర్ మాట్లాడుతూ షుగర్ వ్యాధి దీర్ఘకాలికమైనదని, దాన్ని మొదటి దశలోనే గుర్తించి వైద్యం అందిస్తే దీర్ఘకాలికంగా వచ్చే సమస్యలను నివారించవచ్చునని తెలిపారు. ప్రధానంగా కిడ్నీ, గుండె, నరాలు, కంటి సంబంధిత వ్యాధులు రాకుండా నివారించవచ్చునని తెలిపారు. విజయశ్రీ హాస్పిటల్ అధినేత డాక్టర్ దేరకొండ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా 54 కోట్ల మంది మధుమేహం వ్యాధితో బాధపడుతున్నట్లు తెలిపారు. షుగర్ వ్యాధి వల్ల లివర్ సంబంధి వ్యాధి అయిన ఫ్యాటీ లివర్ వ్యాధికి దారి తీసే అవకాశం ఉన్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో డాక్టర్ సురేష్, డాక్టర్ ఆమని, హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

కాలి గాయాలకు ప్లాస్టిక్ సర్జరీ

డాక్టర్ వై.సునీల్ కిషోర్

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్



మధుమేహ వ్యాధి కారణంగా వచ్చే కాలి గాయాలకు ప్లాస్టిక్ సర్జరీ అందుబాటులో ఉన్నాయని ఉషా సూపర్ స్పెషాలిటీ ప్లాస్టిక్, కాస్మోటిక్ సర్జన్ డాక్టర్ వై.సునీల్ కిషోర్ తెలిపారు. ప్రపంచ మధుమేహ దినోత్సవం సందర్భంగా సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ వై.సునీల్ కిషోర్ మాట్లాడుతూ దేశంలో సుమారు 69 మిలియన్ ప్రజలు షుగర్ వ్యాధితో బాధపడుతున్నారని తెలిపారు. వారిలో 15 శాతం మంది కాలి గాయాలతో బాధపడుతున్నారన్నారు. కాలి ఇన్‌ఫెక్షన్‌కు సరైన సమయంలో వైద్యం తీసుకోకపోతే ప్రాణాంతక మవుతుందన్నారు. కాలు వాయటం, నొప్పి రావటం, జ్వరం రావటం లక్షణాలు ఉంటే వీలైనంత త్వరగా వైద్యుని సంప్రదించాలన్నారు. అరికాలి గాయాలకు సర్జరీ ద్వారా నయం చేయవచ్చన్నారు. ఆఫ్ లోడింగ్ సర్జరీలు, స్కిన్ (గ్రాఫ్టింగ్), ఫ్లాప్ సర్జరీలు ద్వారా షుగర్‌తో ఏర్పడిన దీర్ఘకాలిక గాయాలను తగ్గించవచ్చునని డాక్టర్ సునీల్ కిషోర్ సూచించారు.

విజ్ఞాన సముపార్జనకు పుస్తక పఠనమే మార్గం : సబ్‌కలెక్టర్

ప్రజాశక్తి-మార్కాపురం

విజ్ఞాన సముపార్జనకు పుస్తక పఠనం ఒక్కటే మార్గమని మార్కాపురం సబ్ కలెక్టర్ సేతు మాధవన్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక శాఖా గ్రంథాలయంలో గ్రంథపాలకుడు దొండపాటి సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. ముఖ్య అతిధిగా సబ్ కలెక్టర్ మాధవన్‌తో పాటు మున్సిపల్ చైర్మన్ చిర్లంచెర్ల బాలమురళీక్రిష్ణ పాల్గొని ఈ వేడుకలను ప్రారంభించారు. ముందుగా జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాధవన్ మాట్లాడారు. 55వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను నిర్వహించడం అభినందనీయమన్నారు. మున్సిపల్ చైర్మన్ చిర్లంచెర్ల బాలమురళీక్రిష్ణ మాట్లాడుతూ గ్రంథాల యానికి త్వరలో రోడ్డు నిర్మాణం చేపడతామన్నారు. పట్టణ ప్రజలు గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డివిజనల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ బివిఎన్ సాయికుమార్, తహశీల్దారు శ్రీనివాసరావు, ఎంఇఒ బి.రాందాస్‌నాయక్, శ్రీసాధన డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కప్పగంతుల మధుసూదన్, ఉపాధ్యాయులు పిన్నిక ప్రసాద్, ఎన్ ఉమాదేవి, గ్రంథపాలకుడు దొండపాటి వెంకటసుబ్బారెడ్డి తదితరులు మాట్లాడారు.



మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ మాధవన్

పెద్దదోర్నాల : స్థానిక శాఖాగ్రంథాలయంలో గ్రంథపాలకుడు వై.వెంకటేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో 55వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జాతీయ జెండావిష్కరణ దోర్నాల మేజర్ పంచాయతీ సర్పంచి చిత్తూరి హారిక చేశారు. అనంతరం నెహ్రూ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు హారిక మాట్లాడుతూ నేటి బాలలే రేపటి పౌరులని, నెహ్రూ జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. గ్రంథాలయాలు పిల్లలు అభ్యున్నతికి ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిపిఎస్ స్కూల్ ప్రధానోపాధ్యాయుడు సుధాకర్, మూలా నాగేంద్రరెడ్డి పాల్గొన్నారు.

నాగులుప్పలపాడు : మండలంలోని ఉప్పుగుండూరు శాఖాగ్రంథాలయంలో సోమవారం వారోత్సవాల కార్యక్రమం గ్రంథపాలకురాలు పి నాగరజని ప్రారంభించారు ఈసందర్భంగా గ్రామ సర్పంచి దేవరకొండ జయమ్మ నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు నెహ్రూను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని అన్నారు. ఈకార్యక్రమంలో గ్రామస్తులు విద్యార్థులు పాల్గొన్నారు.

మద్దిపాడు : మండలంలోని మద్దిపాడు, ఏడుగుండ్లపాడు, నెలటూరు గ్రామాలలోని గ్రంథాలయాలలో జవహర్‌లాల్ నెహ్రు పుట్టినరోజు సందర్భంగా 55వ గ్రంథాలయ వారోత్సవాలు సోమవారం ఆయా గ్రంథాలయాలలో జరిగాయి. ఈ సందర్భంగా పుస్తకాలు ప్రదర్శన నిర్వహించడం జరిగింది. స్థానిక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల (తూర్పు)లో విద్యార్థులకు ఆటలు పోటీలు నిర్వహించి, గెలిచిన వారికి ఎంఇఒ ఆంజనేయులు బహుమతులు పంపిణీ చేశారు. విద్యార్థులు ఆటలతో పాటు చదువులో శ్రద్ధ వహించాలన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎన్ వి నరసింహారావు, యు శ్రీనివాసరావు పాల్గొన్నారు.



లోక్‌సభ స్పీకర్‌తో ఎంపి మాగుంట

లోక్‌సభ స్పీకర్‌ను కలిసిన ఎంపీ మాగుంట

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

లోక్ సభ స్పీకర్ ఓం బిర్లాను ఒంగోలు పార్లమెంట్ సభ్యుడు మాగుంట శ్రీనివాసులు రెడ్డి సోమవారం ఢిల్లీలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా స్పీకర్‌కు ఎంపి మాగుంట శ్రీనివాసులు రెడ్డి జ్ఞాపికను అందజేశారు

16న ఎంపి మాగుంట పర్యటన

ఒంగోలు ఎంపి మాగుంట శ్రీనివాసులు రెడ్డి ఈనెల 16న పలు కార్యక్రమాలలో పాల్గొననున్నారు. ఉదయం 9.30 గంటలకు టంగుటూరు మండలం వల్లూరు గ్రామం దగ్గర పేస్ కాలీజీలో జరగనున్న రీజినల్ పాలిటెక్ ఫెస్ట్ 2022 ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరవుతారు. అనంతర 10.30 గంటలకు ఒంగోలు దక్షిణ బైపాస్ దగ్గరలో ఉన్న పాత జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జరుగు జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో పాల్గొంటారు.



నిరసన తెలియజేస్తున్న సిపిఎం నాయకులు

బ్రిడ్జిని పునర్నిర్మించాలి : సిపిఎం

ప్రజాశక్తి - సంతనూతలపాడు రూరల్

మండలంలోని సంతనూతలపాడు - మైనంపాడు గ్రామాల మధ్యలో గల గుళ్ల వాగు పై ఉన్న బ్రిడ్జిని పునర్నిర్మించాలని మైనంపాడు సిపిఎం గ్రామ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. గుళ్లవాగుపై ఉన్న బ్రిడ్జి కూలిపోయే దశలో ఉందని వెంటనే దాని స్థానంలో నూతన బ్రిడ్జిని నిర్మించాలని సిపిఎం డిమాండ్ చేశారు. దానితోపాటు సంతనూతలపాడు నుండి మైనంపాడు గ్రామం వరకు జడ్ పి రోడ్డు అధ్వాన్న స్థితిలో ఉందని, వాహనదారులు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వెంటనే రోడ్డు మరమ్మత్తులు చేయాలని కోరారు. గుళ్లవాగుపై ఉన్న బ్రిడ్జి కూలిపోయే దశలో ఉందని అది ఏ దశలోనైనా కూలిపోవచ్చు అని వారు ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే ప్రభుత్వ అధికారులు స్పందించి నూతన బ్రిడ్జిని మరియు రోడ్డును పునర్నిర్మించాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు కిలారి పెద్దబ్బాయి, సిపిఎం మైనంపాడు గ్రామ కమిటీ కార్యదర్శి అద్దంకి భగత్ సింగ్, నాయకులు గుండవరపు సుబ్బారావు, షేక్ నాయబ్, షేక్ కమాల్ తన్నీరు సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



పొలంబడి నిర్వహిస్తున్న వ్యవసాయాధికారులు

జరుగుమల్లిలో పొలంబడి

జరుగుమల్లి: జరుగుమల్లి గ్రామము నందు వ్యవసాయ శాఖ అధికారులు సోమవారం పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు.కార్యక్రమానికి స్థానిక మండల వ్యవసాయ అధికారి డి. యుగంధర్ రెడ్డి పాల్గొని మాట్లాడుతూ పొలంబడి కార్యక్రమము అనేది ప్రతి సోమవారం క్షేత్ర స్థాయిలో నిర్వహిస్తామని తెలిపారు.అలాగే పొలంబడి కార్యక్రమములో రైతు ప్రతి వారం పంటను అధికారుల సమక్షంలో పరిశీలించుకొని సరైన సలహాలు పొందవచ్చని అన్నారు. ఈకార్యక్రమములో జరుగుమల్లి మరియు కొండపి మండలాల ప్రకతి వ్యవసాయ విభాగ సిబ్బంది బి. ఎస్తేరమ్మ, పి పెద్దిరాజు. రంజిత్. సురేష్ , రైతులు పాల్గొన్నారు.

నర్సింగపురం భూముల్లో...

అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలి

రైతు సంఘం డిమాండ్



ధర్నాలో పాల్గొన్న బాధితులు

ప్రజాశక్తి-మార్కాపురం

త్రిపురాంతకం మండలం వెల్లంపల్లి గ్రామ పంచాయతీలోని నర్సింగపురం గ్రామంలో జరిగిన భూ అక్రమాలపై చర్యలు తీసుకోవాలని బాధిత రైతులతో పాటు ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు గాలి వెంకటరామిరెడ్డి డిమాండ్ చేశారు. నర్సింగపురం స్తోత్రీయ రెవెన్యూ గ్రామంలో జరిగిన భూ అక్రమాలపై స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా గాలి వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ అక్కడి రైతులు వారి తాతల కాలం నుంచి భూములను సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారని, పన్నులు కూడా కడుతున్నారని ఆయన అన్నారు. అక్కడి పొలాలను రెవెన్యూ అధికారులు పాలుట్ల అరుణకుమారి అనే పేరుతో గ్రామ రెవెన్యూలోని భూములకు సంబంధించి స్థానిక రైతుల పేర్లను మార్పులు చేసి 120 ఎకరాల భూమిని ఆమె పేరుతో మార్చు కోవడం జరిగిందన్నారు. ఆ తరువాత విజయవాడలో సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులో సత్య ఫిష్ కంపెనీ వారికి విక్రయించి రిజిస్ట్రేషన్ చేయడం జరిగిందన్నారు. ఇక్కడి రైతులు 50 ఏళ్లకు పైగా అనుభవంలో ఉన్న భూములను అరుణకుమారి పేరుతో ఆన్‌లైన్ చేయడం ఏమిటని ప్రశ్నించారు. ఇక్కడి రైతులకు ఎలాంటి నోటీసు కూడా ఇవ్వలేదన్నారు. అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని, రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం సబ్ కలెక్టర్ సేతు మాధవన్‌కు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కంకణాల ఆంజనేయులు, గుమ్మా బాలనాగయ్య, రైతు నాయకులు కోట్ల నాగిరెడ్డి, సంకుల మల్లయ్య, మల్లు సత్యనారాయణరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జనార్ధన్‌రెడ్డి

కందుల నారాయణరెడ్డికే టిడిపి టిక్కెట్

టిడిపి జిల్లా పరిశీలకులు జనార్ధన్‌రెడ్డి

పొదిలి : వచ్చే అస్లెంబీ ఎన్నికల్లో మార్కాపురం నియోజకవర్గంలో టిడిపి టిక్కెట్ కందుల నారాయణ రెడ్డికి వస్తుందని టిడిపి జిల్లా పరిశీలకులు, మాజీ ఎమ్మెల్యే బిసి జనార్ధన్ తెలిపారు. స్థానిక కార్యాలయంలో టిడిపి కార్యకర్తల సమావేశం సోమవారం నిర్వహించారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడారు. బాదుడే బాదుడు, ఇంటింటికి కందుల కార్యక్రమాలతో ప్రజలను చైతన్య పరిచిన ఘనత కందులకే దక్కుతుందన్నారు. అధికార పార్టీ అక్రమాలు, అవినీతి, అధిక భారాలతో నియోజకవర్గ ప్రజలందరూ టిడిపి వైపు మొగ్గుచూపుతున్నారని తెలిపారు. ఈ సమావేశంలో టిడిపి మార్కాపురం నియోజక వర్గ ఇన్‌ఛార్జి కందుల నారాయణరెడ్డి, టిడిపి నాయకులు కాటూరి వెంకట నారాయణ బాబు, నారాయణ ప్రతాప్, మీగడ ఓబుల్ రెడ్డి, ముల్లా ఖుర్దూస్ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ప్రత్యేక అభివృద్ధి నిధిగా మార్చాలని వినతి

నాగులుప్పలపాడు: ఎస్‌సి, ఎస్‌టి సబ్‌ప్లాన్ ఉపప్రణాళిక కాలపరిమితిని తొలగించి ప్రత్యేక అభివృద్ధి నిధి చట్టంగా మార్చాలని దళిత గిరిజన బడ్జెట్ వాచ్ ప్రకాశంజిల్లా కన్వీనర్ దార్ల కోటేశ్వరరావు అన్నారు. ఈ సందర్భంగా నాగులుప్పల పాడు ఒమ్మెవరం గ్రామానికి గడపగడపకూ కార్యక్రమా నికి విచ్చేసిన ఎమ్మెల్యే టిజెఆర్ సుధాకర్‌బాబుకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ చట్టం పేరును ఆంధ్ర ప్రదేశ్ ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక అభివద్ధి నిధి చట్టంగా మార్చాలని ఆయన అన్నారు. ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేసినవారిలో ఒంగోలు కమ్యూనిటీ మొబలైజర్ ఆదినారాయణ, ముండ్లమూరు మండలం కమ్యూనిటీ మొబలైజర్ వెంకటరావు, దర్శి కమ్యూనిటీ మొబలైజర్ గుంటూరు నాగమణి , దళిత గిరిజన మత్స్యకారుల సొసైటీ చైర్మన్ మేకల ఆదినారాయణ, యానాది సేవాసంఘం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ ఈగ శ్రీనివాసరావులు ఉన్నారు.

ముగిసిన క్రీడా పోటీలు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెంలోని వైఎస్ఆర్ క్రీడా వికాస కేంద్రంలో ఈ నెల 11, 12, 13 తేదీల్లో డాక్టర్ వైఎస్ఆర్ క్రీడా వికాస కేంద్ర అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన డివిజన్ స్థాయిలో క్రీడా పోటీలు సోమవారంతో ముగిశాయి. షటిల్ టోర్నమెంట్‌లో 55 టీములు తలపడగా మొదటి బహుమతిని మార్కాపురానికి చెందిన రమేష్ టీము కైవసం చేసుకుంది. రెండో బహుమతిని మార్కాపురానికి చెందిన షేక్ బాషా టీము గెలుచుకుంది. మూడో బహుమతి యర్రగొండపాలెంకు చెందిన హర్షా టీము కైవసం చేసుకుంది. ప్లేయర్ ఆఫ్ ద టోర్నమెంట్ అవార్డును మార్కాపురానికి చెందిన విజయ్, యర్రగొండపాలెంకు చెందిన షేక్ జానీ అందుకున్నారు. విజేతలకు ప్రథమ బహుమతిగా రూ. 5,016, ద్వితీయ బహుమతిగా రూ. 3,016, తృతీయ బహుమతిగా రూ. 2,016 నగదు బహుమతులతో పాటు మెమెంటోలు, ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వైఎస్ఆర్ క్రీడా వికాస కేంద్ర అభివృద్ధి కమిటీ చైర్మన్ నర్రెడ్డి వెంకటరెడ్డి, పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి, డాక్టర్ వైఎస్ఆర్ క్రీడా వికాస కేంద్రం ప్రధాన కార్యదర్శి రామ సుబ్బయ్య, నలగాటి శివ కోటేశ్వరరావు, సహాయ కార్యదర్శి జబివుల్లా, నాయకులు సుబ్బారెడ్డి, ఓబుల్‌రెడ్డి, క్రీడాకారులు పాల్గొన్నారు.

కుష్ఠు వ్యాధిపై శిక్షణా కార్యక్రమం

ప్రజాశక్తి-కొండపి

గ్రామాలలో ఇంటింటికి తిరిగి కుష్ఠు వ్యాధిగ్రస్తులను గుర్తించి వారికి అవగాహన కల్పించాల్సిన బాధ్యత ఆయా గ్రామాల వాలంటీర్లకు, ఆశాలపై ఉందని పెట్లూరు పిహెచ్‌సి వైద్యురాలు డాక్టర్ అనూష తెలిపారు. సోమవారం కొండపిలోని మండల అభివృద్ధి కార్యాలయంలో కుష్ఠు వ్యాదిపై రీ-ఓరియంటేషన్ శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ అనూష మాట్లాడుతూ ఈ నెల 15వ తేది నుంచి డిసెంబర్ 5వ తేదీ వరకు గ్రామాలలో ఇంటింటికి తిరిగి కుష్ఠు వ్యాధిగ్రస్తులను గుర్తించి వారికి అవగాహన కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆశాలు, వాలంటీర్లు గ్రూపుగా ఇంటింటికి తిరుగుతారన్నారు. అనంతరం కుష్ఠు వ్యాదిపై అవగాహన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ బ్రహ్మయ్య, పెట్లూరు వైద్యసిబ్బంది ఆశావర్కర్లు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్నకాలనీలలో పర్యటన

ప్రజాశక్తి - మద్దిపాడు

జగనన్న కాలనీలు త్వరితగతిన పూర్తి చేయాలని స్థానిక తహశీల్దార్ జె లక్ష్మినారాయణ లబ్దిదారులను ఆదేశించారు. సోమవారం మండలంలోని ఇనమన మెళ్లూరు, బసవన్నపాలెం గ్రామాలలోని కాలనీలను సందర్శించారు. ప్రభుత్వం నుంచి ఆర్థిక సహాయం ఉపయోగించుకోవాలని సూచించారు. .వీరివెంట హౌసింగ్ ఎఇ హేమలత, గ్రామ రెవెన్యూ అధికారి సుశీల్, లబ్ధిదారులు పాల్గొన్నారు.

నేటి బాలలే రేపటి దేశసంపద : సివిల్ జడ్జి

ప్రజాశక్తి-శింగరాయకొండ

నేటి బాలలే రేపటి భారత దేశానికి సంపదని అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి పి పూర్ణిమాదేవి అన్నారు. జవహర్ లాల్ నెహ్రూ జయంతిని పురస్కరించుకొని సోమవారం స్థానిక అంబేద్కర్ గురుకుల పాఠశాలలో ఏర్పాటుచేసిన సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొని ఆమె మాట్లాడుతూ బాలలు మంచి నడవడికతో ఉన్నత భవిష్యత్తును అందుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ రమాదేవి, సీనియర్ న్యాయవాది సన్నెబోయిన శ్రీనివాసులు కోర్టు సిబ్బంది కె.శివన్నారాయణ, న్యాయ సేవా సహాయకులు పంతగాని వెంకటేశ్వర్లు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థినిలకు సర్టిఫికెట్‌లు ఇస్తున్న జడ్జి

దొనకొండ: మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో బాలల దినోత్సవ వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక విశ్వభారతీ విద్యాలయంలో జరిగిన వేడుకల్లో మండల విద్యాధికారి ఎస్.సాంబశివరావు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ జవహార్‌లాల్ నెహ్రూ జయంతిని బాలల దినోత్సవం వేడుకగా జరుపుకుంటారని ఆయన జీవిత చరిత్రను వివరించారు. ఈ కార్యక్రమాలలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కొండపి : జవహర్ లాల్‌నెహ్రు జయంతి సందర్భంగా బాలల దినోత్సవ కార్యక్రమం జరుపుకుంటున్నామని కొండపి-2 పంచాయితీ కార్యదర్శి పూజిత తెలిపారు. సోమవారం నాడు మండలంలోని కట్టావారిపాలెం అంగన్‌వాడీ కేంద్రం నందు బాలలదినోత్సవ కార్యక్రమం చేపట్టారు. అనంతరం నెహ్రు చిత్రపటానికి సచివాలయం సిబ్బంది, అంగన్‌వాడీ సిబ్బంది పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మహిళా పోలీసు బార్గవి, వెల్ఫేయర్, అంగన్‌వాడీ కార్యకర్త సాయిలీల, ఆయా జ్యోతి, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పెద్దదోర్నాల : స్థానిక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల మెయిన్‌లో బాలల దినోత్సవ వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంఇఒ బి.మస్తాన్‌నాయక్ హాజరై మాట్లాడుతూ పండిత్ జవహర్‌లాల్ నెహ్రూ దేశాభివద్ధిలో ప్రముఖ పాత్ర వహించారన్నారు. అనంతరం నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ఎస్‌కె.షరీఫ్, ఉపాధ్యాయులు మందగిరి వర్ధన్, వెంకటేశ్వర్లు, లక్ష్మిపార్వతి, విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.

కొనకనమిట్ల : విద్యార్థులు జవహర్‌లాల్ నెహ్రూ స్పూర్తితో బాగా చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని తహాశీల్దార్ కెవిఆర్‌వి.ప్రసాద్‌రావు పేర్కొన్నారు. బాలల దినోత్సవము సందర్భంగా స్థానిక ఎఎ పాఠశాలలో నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం గాయం కాశిరెడ్డి, మస్తాన్, సాయిలక్ష్మీ, రహీం, విఆర్ఓ రాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

పామూరు: నేటి బాలలే రేపటి పౌరులని జనవిజ్ఞానవేదిక కనిగిరి డివిజన్ గౌరవ అధ్యక్షులు డాక్టరు చెన్నక్రిష్ణయ్య అన్నారు. సోమవారం బాలల దినోత్సవం సందర్భంగా బాలల సంఘం ఆధ్వర్యంలో ప్రిన్సిపల్ శైలజ అధ్యక్షతన కస్తూరిబా పాఠశాలలో బహుమతుల ప్రదానం జరిగింది. ఈ కార్యక్రమంలో ఐద్వా కార్యదర్శి ఖాదరున్నీసా, ధనలక్ష్మి, అంజలి, మదారమ్మ, అంకమ్మ, రజియా, శంరర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వెలిగండ్ల : స్థానిక శాఖాగ్రంథాలయంలో బాలల దినోత్సవము సందర్భంగా జవహర్ లాల్ నెహ్రూ చిత్రపటానికి సోమవారం పూలమాలలు వేసి నివాళు లర్పించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం బాలల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన మండల స్థాయి టాలెంట్‌టెస్ట్‌కు దాత ఎలికా రమణయ్య ఆర్థిక సహాయంతో బహుమతులను ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో పరిషత్ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ సుబ్బారావు, జడ్‌పిటిసి గుంటక తిరుపతిరెడ్డి, సర్పంచి సురేష్‌బాబు, ఎంపిటిసి చిలకల వెంకటేశ్వర్‌రెడ్డి, వైసిపి నాయకులు మీరావలి, దేవసహాయం తదితరులు పాల్గొన్నారు.

కనిగిరి : పట్టణంలోని ఐకిడ్స్ పాఠశాలలో బాలల దినోత్సవ వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. స్కూల్ డైరక్టర్ ఎస్‌కె రజియా, ప్రిన్సిపల్ ఎస్‌కె షరీఫ్‌లు బాలల దినోత్సవ ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు అమృతవాణి ,శైలి, శ్రీదేవి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల శ్మశానంపై వైసిపి నేతల కన్ను

(మొదటిపేజీ తరువాయి)


అడ్డుకున్నాడు. గత ఆరు నెలల క్రితం కూడా ఇదే పరిస్థితి ఇక్కడ జరిగింది. అప్పుడు రెవెన్యూ అధికారులు ఇది శ్మశానం భూమి అని చెప్పారు. ఆ రోజు అలా చెప్పడంతో సమస్య సద్దుమణిగింది. గిరిజనులు జిల్లా కలెక్టర్‌కు ఈ విషయాన్ని వివరించారు. కలెక్టర్ సైతం గిరిజనులకు శ్మశానం కింద భూమి ఇవ్వాలని సూచించారు. రెండున్నర ఎకరాల భూమిని మల్లికార్జున్‌నగర్, బాల్‌రెడ్డినగర్, గుజ్జుల ఎలమందారెడ్డి నగర్‌కి కేటాయించారు. అక్కడ శ్మశానం కింద భూమిని వాడుతున్నారు. అలా శ్మశానంగా ఉన్న భూమిని వైసిపి నేత దున్ని పైరు సైతం వేశారు. పొలం దున్నేటప్పుడు సైతం గిరిజనులు అడ్డుపడ్డా లెక్కచేయలేదు. సోమవారం నాడు మతదేహాన్ని తీసుకొని వెళ్లి దహన సంస్కరాలు చేస్తుండగా వైసిపి నేత అడ్డుకున్నారు. గిరిజనులను బెదిరించారు.. వారిపై దాడి చేసేందుకు వెళ్లారు. అక్కడ ఉన్న ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యులు పొట్లూరి లక్ష్మయ్య, బిందుశ్రీ, వై.శ్రీనివాసులుతో పాటు కాలనీవాసులు ఎస్పై ఫిరోజా ఫాతిమాకు., తహాశీల్దార్ సి హెచ్.ఉషాకు సమాచారం అందజేశారు. వెంటనే రంగంలోకి దిగిన పోలీసు, రెవెన్యూ అధికారులు అక్కడకు చేరుకొని గిరిజనులతో మాట్లాడారు. తహాశీల్దార్ సి హెచ్.ఉషాకు సమస్యను వివరించారు. ఈ సమస్య తనకు పూర్తిగా తెలుసని, ఇది ప్రభుత్వ భూమి అని, ఈ విషయం కోర్టు దష్టికి కూడా తీసుకుపోయామని, ఇది గిరిజనులకు ఇచ్చిన శ్మశాన భూమేనని గిరిజనులకు వివరించారు. తహాశీల్దార్ ఉషా వెంటనే సర్వే బందాన్ని పిలిపించి.. శ్మశానానికి సంబంధించి భూమిని కొలతలు వేసి.. గిరిజనులకు అప్పగించాలని ఆదేశించారు. రెవెన్యూ, పోలీసుల సహకారంతో మృతదేహాన్ని గిరిజనులు అక్కడే పూడ్చారు. గిరిజనుల ఫిర్యాదుతో వైసిపి నేత చాంద్‌బాషాపై ఎస్సీ, ఎస్టీ, అట్రాసిటీ కేసు నమోదు చేశారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

వెలిగండ్ల : అంగన్‌వాడీ వర్కర్లకు కనీస వేతనం నెలకు రూ.26వేలు ఇవ్వాలని సిఐటియు నాయకులు రాయల మాలకొండయ్య సోమవారం పంచాయితీ కార్యదర్శి విజయ భాస్కర్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలకు మౌలిక వసతులు కల్పించాలని, అంగన్‌వాడీ సమస్యలు పరిష్కరించాలని, లబ్ధిదారులకు ఇచ్చే పౌష్టికాహార క్వాంటిటీ పెంచాలని పెంచాలని డిమాండ్ చేశారు. అనంతరం ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ తిరుపతమ్మ, పద్మ, రఫియా, ప్రమీల, ప్రభావతి, చంద్రకళ, విజయలక్ష్మి, అనురాధ, ఎం.పార్వతి, ముక్కు వరలక్ష్మి, సుభాషిని, షలోమి, హుస్సేనమ్మ, మహాలక్ష్మమ్మ పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు : ఎమ్మెల్యే అన్నా

గిద్దలూరు : ముఖ్య మంత్రి జగన్ మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన నవరత్నాల ద్వారా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందాయని ఎమ్మెల్యే అన్నా రాంబాబు అన్నారు. సోమవారం నగర పంచాయతీ పరిధిలోని కొంగలవీడు రోడ్డు సచివాలయం పరిధిలో 60వ రోజు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే అన్నా రాంబాబు పాల్గొన్నారు. ఎమ్మెల్యే అన్నా వార్డులోని ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిని వివరించి మూడేళ్ళ పాలనలో అందించిన సంక్షేమ బుక్ లేట్ అందించి ప్రభుత్వ పథకాల లబ్దిని వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అన్నా మాట్లాడుతూ ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు ముఖ్య మంత్రి రాష్ట్ర వ్యాప్తంగా గడప గడపకూ మన ప్రభుత్వానికి శ్రీకారం చుట్టారన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి తక్షణమే చర్యలు తీసుకునే విధంగా గడపగడపకూ కార్యక్రమాన్ని చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం కొంగలవీడు రోడ్డులోని బాల సరస్వతి స్కూల్ లో జరుగుతున్న బాలల దినోత్సవ వేడుకల్లో ఎమ్మెల్యే అన్నా పాల్గొని నెహ్రూ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించి, చిన్నారులకు చాక్లెట్లు, బిస్కట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పాముల వెంకట సుబ్బయ్య, వైస్ చైర్మన్ ఆర్‌డి రామకష్ణా, కాతా దీపికా, మాజీ ఎంపిపి కడప వంశీధర్ రెడ్డి, వైసిపి నాయకులు బత్తెం ఓబుల్ రావు, పరుచూరి నాగేశ్వరరావు, పాముల శ్రీకాంత్ యాదవ్, కో ఆప్షన్ సభ్యుడు షేక్ మస్తాన్ వలి, మున్సిపల్ కమిషనర్ రామకష్ణయ్య, వైసిపి నాయకులు, అధికారులు, పాల్గొన్నారు.



గడపగడపకూలో బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే అన్నా



భూమి పూజ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే బుర్రా

అదనపు తరగతి గదులకు భూమి పూజ

కనిగిరి: నాడు నేడు పథకం ద్వారా ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలు అభివృద్ధి చెందుతు న్నాయని ఎమ్మెల్యే బుర్రా మధు సూదన్‌యాదవ్ తెలియ జేశారు. సోమ వారం కనిగిరి మండలం పాత పాడు జడ్‌పి ఉన్నత పాఠశాలలో రూ 48 లక్షలతో తరగతి గదుల నిర్మాణానికి ఆయన భూమి పూజ నిర్వహించారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థానాలను అధిరోహిం చాలని విద్యార్థులకు ఆయన సూచించారు. బాలల దినోత్స వేడుకల్లో పాల్గొని విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈకార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం ఆర్ శ్రీనివాసాచారి, జెడ్‌పిటిసి మడతల కస్తూరిరెడ్డి, ఎంపిపి దంతులూరి ప్రకాశం, ఎంపిటిసి అట్లా రామచంద్రారెడ్డి, సర్పంచి ఎం నవమ్మ, ఎస్‌ఎంసి చైర్మన్ అట్లా పిచ్చిరెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు సంగు సుబ్బారెడ్డి, జమ్మలమడక సర్పంచి పాశం కొండయ్య, వైసిపి నాయకులు ఎస్ రంగనాయకులరెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సాయిబాబా

జగనన్న కాలనీల సందర్శన

గిద్దలూరు : అర్ధవీడు మండలంలోని పాపినేనిపల్లి గ్రామంలో ప్రభుత్వం కేటాయించిన జగనన్న కాలనీలో సోమవారం నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌ఛార్జి బెల్లంకొండ సాయి బాబా పరిశీలించడం జరిగింది. లేఆవుట్ లో 141 మంది లబ్దిదారులకు ఇళ్ల స్థలాలు కేటాయించగా నేటికి ఒక్కరు కూడా పునాదులు నిర్మించలేదన్నారు. నివాసయోగ్యంగా లేని గ్రామానికి దూరంగా ఎటువంటి వసతులు లేని కొండ ప్రాంతంలో ఇళ్ల స్థలాలను కేటాయిస్తే ఇళ్లు ఎలా నిర్మించుకుంటారని ఆయన ప్రశ్నించారు. కావున అధికారులు నివాసయోగ్యమైన స్థలాలు కేటాయించాలని ఆయనకోరారు. కార్యక్రమంలో జనసేన పార్టీ జిల్లా సంయుక్త కార్యదర్శి కాల్వ బాల రంగయ్య, అర్ధవీడు మండల అధ్యక్షుడు అల్లూరయ్య, సిద్ధం వెంకటేశ్వర్లు, శేషాద్రి నాయుడు, అంబటి దాసు బాబు, కొంకేల రంగస్వామి,శ్రీకాంత్ పాల్గొన్నారు.



వన భోజనాలు ప్రారంభిస్తున్న మారంవెంకారెడ్డి

భారీ అన్నదానం

ప్రజాశక్తి-చీమకుర్తి

రామతీర్థంలోని యోగి వేమన రెడ్లసేవా సమితి ప్రాంగణంలో కార్తీకమాసం సంధర్భంగా భారీ అన్నదానం నిర్వహించారు. సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మద్దిపాడు ఎఎంసి మాజీ ఛైర్మన్, యోగి వేమన సేవాసమతి అధ్యక్షుడు మారం వెంకారెడ్డి అన్నదానం ప్రారంభించారు. ముందుగా మోక్షరామలింగేశ్వరస్వామి ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో సమితి ప్రధాన కార్యదర్శి గంగిరెడ్డి ఓబులరెడ్డి,కోశాధికారి చిన్నపురెడ్డి మస్తాన్‌రెడ్డి, వీరారెడ్డి, కోటిరెడ్డి, శ్రీనివాసులరెడ్డి పాల్గొన్నారు.



కంటి ఆపరేషన్‌కు వెళుతున్న వృద్ధులు

కంటి ఆపరేషన్‌కు తరలింపు

ప్రజాశక్తి-కనిగిరి

స్థానిక అమరావతి గ్రౌండ్‌లో టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి ఆధ్వర్యంలో మెగా నేత్ర వైద్యశిబిరాన్ని ఆదివారం నిర్వహించగా, అందులో వైద్యులు కంటి ఆపరేషన్లు అవసరమైన 130మందిని ఆపరేషన్ నిమిత్తం సోమవారం గుంటూరు దగ్గర ఉన్న శంకర నేత్రాలయానికి ప్రత్యేక వాహనంలో మొదటి విడతగా తరలించారు.

బైపాస్ రోడ్డు నిర్మించాలని వినతి

ప్రజాశక్తి-కనిగిరి

కనిగిరి పట్టణంలో హైవే బైపాస్ రోడ్డు నిర్మాణపనులు త్వరతిగతిన ప్రారంభించాలని కోరుతూ భూములు కోల్పోతున్న బాధితులతో కలసి ఆర్‌డిఒ కె సందీప్‌కుమార్, మున్సిపల్ చైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్‌లకు వినతి పత్రాన్ని అందజేశారు.పై అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్తానని ఆర్‌డిఒ తెలిపారు. ఈకార్యక్రమంలో వీరంరెడ్డి బ్రహ్మారెడ్డి, లతీఫ్, ధర్మ, నాని, తిరుపతయ్య, నరసింహా,ఎల్లప్ప, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

మా ఊరికి రావొద్దు..

(మొదటిపేజీ తరువాయి)

సందర్భంగా గ్రామస్తులలో కొందరు వైసిపి నేతలు మాట్లాడుతూ పార్టీలో కొత్తగా వచ్చిన వాళ్లకు ప్రాధాన్యత కల్పిస్తున్నారని, జగనన్న కాలనీకి తోలిన మట్టిని రోడ్లకు తోలి బిల్లులు చేసుకుంటున్న వ్యక్తితో పాటు మరొక వ్యక్తి వల్ల కూడా పార్టీకి చెడ్డపేరు వస్తోందన్నారు. వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. కాలనీలో ఒక్క సిమెంట్ రోడ్డు కూడా వేయలేదని, పట్టాలు ఇచ్చారు గానీ స్థలాలు చూపలేదని పేర్కొన్నారు. మాట్లాడుకొని పరిష్కరించుకోవచ్చని సిఐ, ఎస్‌ఐలు సర్దిచెప్పినప్పటికీ గ్రామస్తులు ససేమిరా అని రోడ్డుపై బైటాయించారు. దీంతో పోలీసులు గ్రామస్తులను నెట్టేశారు. దీంతో కోపోద్రిక్తులైన గ్రామస్తులు ఎమ్మెల్యే ర్యాలీపైకి చెప్పులు, రాళ్లు విసిరారు. దీంతో ఆ ప్రాంతంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఈ నేపథ్యంలో పోలీసు రక్షణలోనే ఎమ్మెల్యే గడపగడపకూ.. కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే కొందరు నిరసనకారులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఇన్ని సమస్యలు ఉంటే తన దష్టికి ఎందుకు తీసుకురాలేదన్నారు. మీ సమస్యలన్నింటినీ పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. నిరసన తెలిపిన వారిలో ప్రమో, గండు హరిబాబు, పి.అశోక్, నల్లూరి సుబ్బయ్య, నక్కల నాగరేణు ఉన్నారు.



మాట్లాడుతున్న మేయర్ గంగాడ సుజాత

రూపాయికే ఇల్లు ఇచ్చిన ఘనత వైసిపిది

మేయర్ గంగాడ సుజాత

ఒంగోలు సబర్బన్ : ఒక్క రూపాయికే టిడ్కో ద్వారా 300 చదరపు అడుగుల ఇంటిని పేదలకు రిజిస్ట్రేషన్ చేసి ఇచ్చిన ఘనత వైసిపి ప్రభుత్వానికే దక్కిందని నగర మేయర్ గంగాడ సుజాత తెలిపారు. వైసిపి జిల్లా కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. టిడ్కో ఇళ్ల విషయంలో మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ చేసిన వ్యాఖ్యలను ఆమె ఖండించారు. టిడిపి హయాంలో ఇవ్వలేని టిడ్కో ఇళ్లను పేదలకు ఒక్క రూపాయికే తమ ప్రభుత్వం ఇచ్చిందన్నారు. పనులు తుది దశలో ఉన్నాయని, త్వరలో గృహ ప్రవేశాలు జరిపిస్తామని తెలిపారు. ఇళ్లు ఇవ్వకుండా పేదల నుంచి డబ్బులు వసూలు చేసిన ఘనత తెలుగుదేశం పార్టీదని ఆమె ఆరోపించారు. తమ పార్టీ యువనాయకులు బాలినేని ప్రణీత్‌రెడ్డిపై అసత్య ఆరోపణలు చేస్తే సహించేది లేదని పేర్కొన్నారు. ఈ సమావేశంలో వైసిపి బిసి సెల్ జిల్లా అధ్యక్షుడు కఠారి శంకర్, కార్పొరేటర్లు ఇమ్రాన్‌ఖాన్, తాడి కృష్ణలత, అంబటి ప్రసాదరావు, వైసిపి నాయకులు వేమూరి మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే గడప గడపకూ : బాలినేని

ప్రజాశక్తి - ఒంగోలు సబర్బన్

ప్రజల సమస్యలు తెలుసుకొని పరిష్కరించేందుకు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి తెలిపారు. నగర పరిధిలోని 22వ డివిజన్ కేశవరావుపేట సచివాలయం పరిధిలోని మేదరపాలెం, శ్రీపతి వారి వీధి, ఏనుగుచెట్టు బజార్ సోమవారం గడప గడపకూ మన ప్రభుత్వ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బాలినేని శ్రీనివాసరెడ్డి ఇంటింటికీ తిరిగి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. డివిజన్‌లో ప్రభుత్వ పెన్షన్లు సక్రమంగా అందుతున్నాయా..? లేదా..? అని లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. పలువురు వృద్ధులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. సమస్యలతో బాధపడుతున్న ఓ వృద్ధురాలికి ఆర్థిక సాయం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాలినేని మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాల పట్ల ప్రజలంతా సంతృప్తిగా ఉన్నారని తెలిపారు. గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన బాలినేని శ్రీనివాసరెడ్డికి ఆప్రాంత ప్రజలు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ గంగాడ సుజాత, కమిషనర్ వెంకటేశ్వరరావు, స్థానిక కార్పొరేటర్ కారంశెట్టి రామపుష్పలత, వైసిపి డివిజన్ అధ్యక్షుడు జడా వెంకటేష్, కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



వృద్ధురాలికి ఆర్థిక సాయం అందజేస్తున్న బాలినేని

అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన

ఐదో ఐదో డివిజన్ గోపాలనగర్ ప్రాంతంలో కార్పొరేషన్ సాధారణ నిధుల నుంచి రూ.38.50 లక్షల వ్యయంతో సిమెంటు రోడ్డు విస్తరణ, మరో రూ.6లక్షల వ్యయంతో మురుగు కాలువ నిర్మాణానికి ఎమ్మెల్యే బాలినేనిశ్రీనివాసరెడ్డి సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ గంగాడ సుజాత, కమిషనర్ ఎం. వెంకటేశ్వరరావు, స్థానిక కార్పొరేటర్ ఎందేటి పద్మావతి, కార్పొరేషన్ డిఇఇ రఘురాం తదితరులు పాల్గొన్నారు.

నేటి బాలలే రేపటి పౌరులు....

నేటి బాలలే రేపటి పౌరులని ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. బాలల దినోత్సవం సందర్భంగా నగరంలోని ఐదో డివిజన్ అంగన్‌వాడీ స్కూల్‌ను సోమవారం ఆయన సందర్శించారు. చిన్నపిల్లల మధ్య కొద్దిసేపు గడిపారు. వారికి మిఠాయిలు పంచి పెట్టారు. బాలల దినోత్సవం సందర్భంగా చాచా నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మేయర్ గంగాడ సుజాత, ఐదో డివిజన్ కార్పొరేటర్ ఎందేటి పద్మావతి, మూడో డివిజన్ కార్పొరేటర్ గండు ధనలక్ష్మి, ఆరో డివిజన్ కార్పొరేటర్ చల్లా తిరుమల తదితరులు పాల్గొన్నారు.

నివాస యోగ్యత ప్రాంతంలో ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు డిమాండ్

ప్రజాశక్తి-మార్కాపురం రూరల్

మార్కాపురం మండలం పెద్దనాగులవరం గ్రామ ఇలాకాలోని సర్వేనెంబర్ 29లోని ప్రభుత్వ కొండ పోరంబోకు భూమిలో ఇంటి స్థలం లేని పేదలందరికీ పట్టాలు ఇచ్చి పక్కా గహాలు నిర్మించాలని వ్యవసాయ కార్మికసంఘం జిల్లాకార్యదర్శి కంకణాల ఆంజనేయులు డిమాండ్ చేశారు. పెద్దనాగులవరంలో ఇళ్ల స్థలాల సాధన సమితి సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కంకణాల ఆంజనేయులు మాట్లాడుతూ నాగులవరంలోని పేదలు ఇళ్ల స్థలాల కోసం దశాబ్ధాలుగా ఎదురుచూస్తున్నారని తెలిపారు. ఎన్నికలకు ముందు రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇచ్చి పక్కా గహాలు నిర్మిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. అయితే ప్రభుత్వం గ్రామానికి దూరంగా నివాసయోగ్యం కాని భూమిని కేటాయించినట్లు తెలిపారు. ఆ ప్రాంతం నివాసానికి అనుకూలంగా లేని కారణంగా పేదలు ఎవరూ అక్కడికి వెళ్లలేదని తెలిపారు. గ్రామ సమీపంలోని కొండ పోరంబోకు భూమిలో అర్హులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని కోరారు. ఇంటి నిర్మాణానికి కనీసం రూ. 5 లక్షలు కేటాయించాలనికోరారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు గుమ్మా బాలనాగయ్య మాట్లాడుతూ గ్రామానికి అనుకొని ఉన్న ప్రభుత్వ కొండ పోరంబోకు భూమి 16 ఎకరాలకు పైగా ఉందన్నారు. అందులో వందలాది మందికి ఇళ్ల స్థలాలు ఇచ్చే అవకాశం ఉన్నట్లు తెలిపారు. ఆ ప్రాంతమైతే ప్రజల నివాసాని యోగ్యంగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు తురక ఏడుకొండలు, ఆర్.తిరుపతయ్య, ఓర్సు అడివయ్య , అంకయ్య తదితరులు పాల్గొన్నారు.



కొండ పోరంబోకు భూమిని పరిశీలిస్తున్న నాయకులు

18లోపు ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తి చేయండి

- నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు
- అధికారులకు కలెక్టర్ ఆదేశం

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

ఎమ్మెల్సీ గ్రాడ్యుయేట్, టీచర్స్ ఎన్నికలకు సంబంధించి వచ్చిన దరఖాస్తులను ఈనెల 18 లోపు విచారణ చేసి ఆన్ లైన్ ప్రక్రియను పూర్తి చేయాలని కలెక్టర్ దినేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. ఈ విషయంలో నిర్లక్ష్యం వహించిన అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ప్రకాశం భవనంలోని కలెక్టర్ కాన్ఫరెన్స్ హాలులో అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దరఖాస్తులను నిష్పక్షపాతంగా పరిశీలన చేయడానికి కమిటీని ఏర్పాటు చేశామన్నారు. ఈనెల 10న పోలింగ్ కేంద్రాల వివరాలను వెల్లడించామన్నారు .గ్రాడ్యుయేట్స్ ఎన్నికలకు 100 పోలింగ్ బూత్ లను, టీచర్స్ ఎన్నికలకు 58 పోలింగ్ బూత్ లను ఏర్పాటు చేశామన్నారు. ఓటర్ కార్డుకు ఆధార్ అనుసంధాన ప్రక్రియను పూర్తి చేయించాలని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఒ బి.చిన ఓబులేసు, మార్కాపురం సబ్ కలెక్టర్ సేతు మాధవన్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ నారదముని, ఒంగోలు, కనిగిరి ఆర్‌డిఒలు విశ్వేశ్వరరావు, సందీప్ కుమార్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.



రాజకీయ పార్టీల నాయకులతో మాట్లాడుతున్న కలెక్టర్

నిరంతర విద్యుత్ సరఫరానే లక్ష్యం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-మార్కాపురం రూరల్

ప్రజలకు నిరాంతరంగా విద్యుత్ సరఫరానే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కె. నాగార్జునరెడ్డి తెలిపారు. మండల పరిధిలోని పెద్ద యాచవరం గ్రామంలో రెండు కోట్ల వ్యయంతో నిర్మించనున్న 33/11 కె.వి విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణానికి సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మండలంలోని విద్యుత్ వినియోగదారులకు విద్యుత్ సరఫరాలో ఎలాంటి ఇబ్బందులూ కలగకుండా నాణ్యమైన విద్యుత్‌ను అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం కొత్తగా 33/11 కెవి సబ్ సేష్టన్ మంజూరు చేసిందన్నారు. ఈ సబ్‌సేష్టన్ పూర్తి అయిన వెంటనే 33 కెవి ఫీడర్ల ద్వారా నాణ్యమైన విద్యుత్ సరఫరా జరుగుతుందన్నారు. తద్వారా వ్యవసాయ రంగానికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పంటలకు సాగు నీరు అందింవచ్చున్నారు. వ్యవసాయ విద్యుత్ సమస్యలను పరిష్కరించడంలో అధికారులు జాప్యం చేయరాదని తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్‌పిటిసి నారు బాపన్‌రెడ్డి, ఎంపిపి పోరెడ్డి అరుణ చెంచిరెడ్డి, విద్యుత్ శాఖ డిఇఇ టి.వి నాగేశ్వరరావు, గ్రామ సర్పంచి కొంగలేటి ప్రసాద్‌రావు, మార్కాపురం వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్మన్ గొలమారి శ్రీనివాసరెడ్డి, ఎంపిటిసి తన్నీరు రామలక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.



శంకుస్థాపనలో ఎమ్మెల్యే నాగార్జున రెడ్డి

అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

కలెక్టర్ దినేష్ కుమార్

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

స్పందన అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ దినేష్ కుమార్ హెచ్చరించారు. అర్జీల పరిష్కారంలో సహేతుకత ముఖ్యమని స్పష్టం చేశారు. సోమవారం కలెక్టరేట్ లో నిర్వహించిన 'డయల్ యువర్ కలెక్టరు', 'స్పందన' కార్యక్రమాలలో ప్రజల నుంచి కలెక్టర్ అర్జీలు, ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ రీఓపెన్ కాకుండా స్పందన అర్జీలను సకాలంలో పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంయుక్త కలెక్టర్ ఎం.అభిషిక్త్ కిషోర్, డిఆర్ఒ బి.చిన ఓబులేసు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు సరళా వందనం, నారదముని, హేలా షారోన్ పాల్గొన్నారు.

డయల్ యువర్ కలెక్టర్‌కి విశేష స్పందన



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్

- బేస్తవారి పేట నుంచి వెంకటస్వామి ఫోన్ చేసి తాను ప్రస్తుతం ఉంటున్న ప్రాంతానికి దూరంగా ఉన్న లేఅవుట్ లో, దాని చివరిలో తనకు ఇంటి స్థలం కేటాయించారని కలెక్టర్‌కు తెలిపారు. వికలాంగుడైన తాను అంత దూరం వెళ్ల లేనని, అవకాశం ఉంటే దగ్గరలో కేటాయించాలని కోరగా, పరిశీలించి చర్యలు తీసుకోవాలని తహశీల్దారును కలెక్టరు ఆదేశించారు.
- కనిగిరి మండలం తుమ్మగుంట నుంచి శివకష్ణ ఫోన్ చేసి గతంలో తమకు కేటాయించిన ఏడు ఎకరాల అసైన్డ్ భూమి ఆక్రమణకు గురైందని, తమకు న్యాయం చేయాలని కోరగా పరిశీలించి చర్యలు తీసుకోవాలని తహశీల్దారు, ఆర్‌డిఒలను కలెక్టర్ ఆదేశించారు.
- రాచర్ల మండలం జె.పుల్లల చెరువు గ్రామం నుంచి వి.రంగా రెడ్డి ఫోన్ చేసి తన భూమిని విఆర్ఒ పేరుతో ఆన్ లైన్ చేశారని ఫిర్యాదు చేశాడు. దీనిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని తహశీల్దారును కలెక్టర్ ఆదేశించారు.